ఈనాడు వనపర్తి

బుధవారం 3 జనవరి 2018 | 16 పేజీలు

రిజిస్ట్రేషన్లపై ఐటీ శాఖ కన్ను

7లో..



ఆటే ప్రాణం.. విజయమే లక్ష్యం

8,9..

తక్కువ వెడల్పు, లోతు తవ్విన డి-8 కాలువ



పనులు చూడరు.. నాసి కనరు!


- డి-8 కాలువ పనుల్లో నాణ్యత కరవు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- అన్నదాతలకు సాగు కష్టాలు

నీటి ఉద్ధృతికి అవినీతి పనులన్నీ కొట్టుకుపోతున్నాయి. పర్సంటేజీలకు కక్కుర్తి పడిన అధికారులు పనుల్లో నాణ్యతను గాలికొదిలేశారు. దీనికితోడు ఉపగుత్తేదారుచేత పనులు చేయించడం, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ముడుపులు డిమాండ్ చేయడంతో డి-8 కాలువ పనులు నాసిరకంగా సాగుతున్నాయన్న ఆరోపణలూ వినిపిస్తున్నాయి.

పరిశీలన

ఈనాడు డిజిటల్, వనపర్తి - న్యూస్‌టుడే, గోపాల్‌పేట

పర్యవేక్షణ లోపంతో గుత్తేదారులు, అధికారులు కుమ్మక్కై అవినీతికి తెర తీస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. లక్ష్యం పూర్తి కాకముందే కాలువలకు గండ్లు పడుతున్నాయి. చేసిన తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు అధికారులు తాత్కాలిక చర్యలు చేపడుతున్నా అవి పూర్తిస్థాయి ప్రయోజనాలు ఇవ్వడం లేదు. నాసి రకం పనుల కారణంగానే ప్రధాన కాలువకు పదుల సంఖ్యలో గండ్లు పడుతూ రైతుల పంట పొలాలను ముంచుతున్నాయి. కేఎల్ఐ ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువ ద్వారా నాగర్‌కర్నూల్ జిల్లా తూడుకుర్తి సమీపంలో నుంచి కోడేరు మండలంలోని సింగాయిపల్లి వరకు చేపట్టాల్సిన 34 కి.మీ. కాలువ పనులన్నీ నాసిరకంగా సాగుతున్నాయి. రెండేళ్ల కిందట చేపట్టిన ఈ పనులన్నీ తూతూమంత్రంగా సాగుతున్నాయి.



ప్రధాన కాలువ నుంచి నీటిని మళ్లించే తూము

సాగు లక్ష్యం 23 వేల ఎకరాలు : వనపర్తి జిల్లాలోని ఆయకట్టుకు సింహ భాగం ప్రయోజనమిచ్చే లక్ష్యంతో చేపట్టిన డి-8 కాలువ నిర్మాణ పనులు అంసపూర్తిగానే ఉన్నాయి. రెండేళ్ల కిందట రూ. 34 కోట్లతో ప్రారంభించిన పనులన్నీ కచ్చ కాలువను తవ్వేందుకు సరిపోయాయి. ఈ కాలువ ద్వారా వనపర్తి జిల్లాలోని లక్ష్మీదేవమ్మపల్లి, పొలికేపాడు, చాకలిపల్లి, గోపాల్‌పేట, ఏదుట్ల, రేమద్దుల, రాజాపూర్, పాన్‌గల్, జయన్నతిర్మాలాపూర్, మున్నూరు, వనపర్తి నల్లచెరువుతోపాటు నాగర్‌కర్నూల్ జిల్లాలోని తూడుకుర్తి, కోడేరు మండలంలోని సింగాయిపల్లి తదితర గ్రామాల రైతులకు సాగునీరు, వీటి పరిధిలో ఉన్న చెరువులు, కుంటలను నింపాలన్న లక్ష్యంతో ఈ కాల్వ నిర్మాణ పనులకు రూపకల్పన చేశారు. ఇప్పటికే పూర్తి చేయాల్సిన పనులు అంసపూర్తిగా మిగిలిపోయాయి.

నిర్మాణంలో లోపాలు.. : కాలువ నిర్మాణంలో పలు లోపాలున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధానంగా కాలువ వెడల్పు ప్రారంభంలో 7.6 మీ. నుంచి చివరి ఆయకట్టు దగ్గర 1.5 మీటర్ల చొప్పున నిర్మాణ పనులు చేపట్టాలి. ఎత్తు ఉన్న ప్రాంతంలో కాలువ లోతును పెంచాలి. తక్కువ లోతున్న చోట కాంక్రీట్, మట్టితో కాలువను పల్లం వైపుగా తీసుకెళ్లాలి. నీటి వేగాన్ని అదుపు చేసేందుకు డ్రాపింగ్‌ల

..మిగతా 3లో



గద్వాలలో రూ. 6.75 కోట్ల పత్తి విత్తనాల పట్టివేత

వివరాలు ప్రధాన సంచికలో..




ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు.. సంఘటనా స్థలంలో లేబుళ్లతో ఉన్న సంచులు

తుది అంకానికి ఈసీసీ కప్-2017 టోర్నీ

15లో..





జిల్లా అభివృద్ధికి కృషి


నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కోశాక జిల్లా అధికారులతో కలెక్టర్ శ్వేతా మహంతి

16లో..



ఏఆర్‌టీ మందులు

బయటపడని వారెందరో!



- హెచ్ఐవీపై కొరవడిన అవగాహన
- తగ్గుదల శాతం చాలా తక్కువ

న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

జిల్లాలో హెచ్ఐవీ బాధితులు పెరుగుతూనే ఉన్నారు. జాగ్రత్తలు పాటించకపోవడంతో చాలామంది రోగం బారిన పడుతున్నారు. పేరు బయటకు పొక్కుతుందని కొందరు భయపడి పరీక్షలు చేయించుకోవడం లేదు. మరి కొందరు వ్యాధి ఉందని తెలిసినా మందులు సరిగ్గా వాడడం లేదు. ప్రభుత్వం అన్ని గ్రామాల్లో ఆశ కార్యకర్తల ద్వారా విస్తృత ప్రచారం చేయించినా సరైన అవగాహన కలగడం లేదని పలువురు చెబుతున్నారు.

తగ్గుదల చాలా స్వల్పం.. : ఏటా హెచ్ఐవీ బారిన పడుతున్న రోగులు పెరుగుతున్నారే తప్ప తగ్గడం లేదు. మహిళల కంటే పురుషులే ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతున్నారు. గతేడాది 6,059 మంది హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోగా.. 171 మందికి, ఈసారి 6753 మందికిగాను 163 మందికి జబ్బు నిర్ధరణ అయినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. వ్యాధి తీవ్రత తగ్గుముఖం పట్టడంలో చాలా వెనకబడి ఉంది. ఏడాదిలో కేవలం 5శాతం మాత్రమే వ్యాధిగ్రస్తులు తగ్గినట్లుగా ప్రభుత్వ ఆసుపత్రి వర్గాలు ఉటంకిస్తున్నాయి. వాస్తవంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో చాలా మంది పరీక్షలు చేసుకొని, వ్యాధి నిర్ధరణ అయినా గుట్టుగా మందులు వాడుతున్నారు. ఈ లెక్కన బయటికి తెలియని రోగులు ఎక్కువే ఉన్నారని తెలుస్తోంది. వనపర్తి సమగ్ర కౌన్సెలింగు, పరీక్ష కేంద్రం (ఐసీటీసీ) నుంచి జిల్లాలో రెండేళ్లుగా 145 మంది హెచ్ఐవీ రోగులు చికిత్స పొందుతున్నారు. జిల్లాలో 2012 మంది హెచ్ఐవీ బాధితులు ఆసరా పొందుతున్నారు. నూటికి 95 శాతం సురక్షితం కాని శారీరక సంబధాలతోనే జబ్బు రావడానికి ఎక్కువ ఆస్కారం ఉందని వైద్యులు చెబుతున్నారు.

నిర్ధరణ పరీక్షలు మహబూబ్‌నగర్‌లోనే.. : జబ్బు నిర్ధరణైతే మహబూబ్‌నగర్‌లోని ఏఆర్‌టీ (ఆంటీ రిట్రో వైరల్ థెరపీ) కేంద్రంలో రక్తకణాల సంఖ్య గుర్తింపునకు సీడీ4 (క్లస్టర్ డీవియేషన్) పరీక్ష చేస్తారు. 500 లోపు రక్తకణాలు ఉంటే ఏఆర్‌టీ మందులు వాడతారు. నాలుగు జిల్లాలకు కలిపి ఈ కేంద్రం మహబూబ్‌నగర్‌లో ఒక్కటే ఉంది. వనపర్తి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఐసీటీసీ, తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమణను నిరోధించే

..మిగతా 3లో

రాష్ట్రంలో సామాజిక రాజ్యస్థాపనే లక్ష్యం

కల్వకుర్తి, న్యూస్‌టుడే : రాష్ట్రంలో సామాజిక రాజ్య స్థాపనే లక్ష్యంగా టీ మాస్ ఫోరం అడుగులు వేస్తుందని, ఈ నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ స్థాయి నుంచి కార్యక్రమాలు చేపడుతున్నట్లు టీ మాస్ ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో టీ-మాస్ ఫోరం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల నరసింహారెడ్డి మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, వ్యక్తిత్వ వికాసాలపై చేపడుతున్న సర్వేల ఆధారాలతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి టీ మాస్ ఫోరం ప్రణాళికలను రూపొందించినట్లు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఉపప్రణాళికలను అమలుచేయాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. టీమాస్ ఫోరం జిల్లా సభ్యులు పర్వతాలు, ఆంజనేయులు, నాయకులు బాల్‌రెడ్డి, కిషోర్, లక్ష్మణ్, లక్‌పతినాయక్, శేఖర్ పాల్గొన్నారు.

ముత్యాలముగ్గుల పోటీలో జనవరి 1 విజేతలు

1. జి.సరిత, మందమర్రి; 2. కె.స్వరూప, సెంటెనెరీ కాలనీ, పెద్దపల్లి; 3. కె.లావణ్య, నిజామాబాద్; 4. ఎస్. ఆకాంక్ష, నారాయణఖేడ్; 5. కె.కరుణ, హైదరాబాద్; 6. ఎం. నిరోష, మందమర్రి; 7. కె. వరలక్ష్మి, హైదరాబాద్, 8. ఎస్.సరస్వతి, గోపాల్‌పూర్; 9. ఎస్.స్రవంతి, భూపాలపల్లి; 10. స్వప్న, హన్మకొండ. విజేతల వివరాలను ఈనాడు డాట్ నెట్‌లో చూడవచ్చు.



ఊరి కోసం పనిచేస్తామని నిరూపించాలి : కలెక్టర్



గ్రామాల్లో గుర్తించిన సమస్యలు నివేదిస్తున్న కిశోర నాయకురాలు



బీవీనగర్ తండాకు చెందిన వినోద్‌కు చరవాణి అందజేస్తున్న కలెక్టర్ రొనాల్డ్‌రోస్

మహబూబ్‌నగర్ అర్బన్, న్యూస్‌టుడే : ఊరి కోసం పనిచేస్తామని నిరూపించాలని జిల్లా కలెక్టర్ రొనాల్డ్‌రోస్ అన్నారు. కౌమార దశలోని బాలబాలికల హక్కుల పరిరక్షణ, వారిలో నైపుణ్యాల పెంపుపై దృష్టి సారించిన కలెక్టర్ రొనాల్డ్‌రోస్ యునిసెఫ్ సహకారంతో జిల్లాలో భారతీ సమీకృత గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలు, వాటి అమలుపై మంగళవారం సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్‌లో ఆయన స్వచ్ఛంద సంస్థలు బర్డ్స్, ఎన్‌సీఎల్‌పీ, ఏకో క్లబ్, హెల్ప్, ఇందిరా ప్రియదర్శిని, టచ్ ప్రతినిధులు, జిల్లా అధికారులు, 26 మండలాల జిల్లాస్థాయి కిశోర నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. యువత ప్రతి ఒక్కరూ స్వచ్ఛభారత్‌కు తమవంతుగా కృషి చేయడంతోపాటు సమష్టిగా ముందుకు సాగాలన్నారు. ప్రతి శనివారం స్వచ్ఛభారత్ సమావేశాలు నిర్వహించాలన్నారు. కిశోర బాలబాలికల సంఘాలు 'గ్రామాలకు వస్తారు.. గోడలపై నినాదాలు రాస్తారు' అని కాకుండా గ్రామ పరిశుభ్రతకు నడుంబిగించి.. చేస్తామని నిరూపిస్తూ.. నమ్మకాన్ని అందరికీ కల్పించాలన్నారు. తలపెట్టిన పనిని ధైర్యంగా పూర్తి చేయాలన్నారు. మనం స్వయంగా చేస్తూ పదిమందితో చేయించాలని అప్పుడే మనం అనుకున్న ఫలితాలు వస్తాయన్నారు. యునిసెఫ్ జిల్లా కోఆర్డినేటర్ బాల్‌చందర్ మాట్లాడుతూ పశ్చిమబంగా తర్వాత పైలట్ ప్రాజెక్టుగా యువశక్తి కార్యక్రమాన్ని మహబూబ్‌నగర్‌లో చేపట్టామన్నారు. సమావేశంలో జిల్లా మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ శంకరాచారి, జిల్లా విద్యాశాఖ అధికారి సోమిరెడ్డి, డీపీవో వెంకటేశ్వర్లు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ సయ్యద్‌అహ్మద్, డీవైఎస్‌వో సత్యవాణి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రాజేశ్వర్, అశోక్, గోవర్ధిని, వినయ్, లక్ష్మన్, డీఆర్‌పీలు, క్లస్టర్ కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

* **చరవాణిల అందజేత :** యునిసెఫ్-బర్డ్స్ ఆధ్వర్యంలో యువశక్తి ప్రాజెక్టులో భాగంగా 10-19 సంవత్సరాల వయస్సుల గల కిశోర బాలబాలికలకు యూ-రిపోర్టులో భాగంగా భావ వ్యక్తీకరణకు గాను ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్ ఉండే చరవాణులు అందజేశారు. ఈ చరవాణిలో కిశోర బాలబాలికల సమస్యలు, పరిష్కారం, చేపట్టిన పనులు పురోగతిని వివరించే అవకాశం ఉంటుందని యునిసెఫ్ జిల్లా సమన్వయకర్త తెలిపారు.

విద్యార్థినులను వేధిస్తున్నారు సార్

సమావేశంలో కలెక్టర్ బాలబాలికల సంఘాల కిశోర నాయకులు అభిప్రాయాలు వెల్లడించాలని కోరగా వారు సూటిగా స్పందించారు. రాజాపూర్ మండలానికి చెందిన హర్షిత మాట్లాడుతూ రాజాపూర్ మండలం కుచ్చెరకల్ గ్రామంలో పాఠశాల, కళాశాలకు వెళ్లే సమయంలో విద్యార్థినులను కొందరు వేధిస్తున్నారని చెప్పింది. గ్రామంలో పారిశుద్ధ్య చర్యలపై ప్రచారం కల్పించేందుకు వెళ్లిన సందర్భంలో తాను ఈ విషయం గుర్తించానని తెలిపింది. మిడ్జిల్‌కు చెందిన అనిత మాట్లాడుతూ నవంబరు 20న బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ టౌన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి కలెక్టర్ వస్తారని ఆశగా ఎదురు చూశామని, రాకపోవడంతో నిరాశపడ్డామన్నారు.

యోగాతో మెరుగైన ఆరోగ్యం

పాలమూరు, న్యూస్‌టుడే : ప్రస్తుతం ఉద్యోగులకు విధుల్లో ఒత్తిడి ఎక్కువయిందని, ఉపశమనం పొందాలంటే యోగాతోనే సాధ్యమని డీఆర్‌డీఏ-ఐకేపీ అదనపు జిల్లా సంచాలకులు మల్లేశ్వర్‌రావు అన్నారు. యోగా ద్వారానే మెరుగైన ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ డ్వామా సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల యోగా ప్రత్యేక శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. తొలిరోజు డీఆర్‌డీఏ-ఐకేపీ, డ్వామాకు చెందిన 69 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. వీరికి యోగా నిపుణుడు ఆంజనేయులు వివిధ అంశాలలో యోగాపై అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ఉదయం నుంచి రాత్రి వరకు కార్యాలయం ఉంటూ ప్రభుత్వ విధులను నిర్వర్తించడమే కాకుండా ఇంటి పనులు, వ్యక్తిగత పనులు, ఇతర పనులతో తీరిక లేకుండాపోయి శారీరకంగా, మానసికంగా ఉద్యోగులు అలిసి పోతున్నారని తెలిపారు. వారికి కొంత ఊరట కలిగేలా యోగా సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ-ఐకేపీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌డీఏ-ఐకేపీ ఉద్యోగులకు యోగాపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

హామీలను విస్మరించి కుటుంబ పాలన

భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



బండోనిపల్లిలో శ్రమదానం చేస్తున్న ఆచారి, భాజపా కార్యకర్తలు

వెల్దండ, న్యూస్‌టుడే : తెలంగాణ రాష్ట్రం వస్తే ఎన్నో సమస్యలు తీరుతాయని ప్రజలు ఆశలు పెట్టుకుని తెరాసకు అధికారం కట్టబెడితే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు మాయమాటలు చెబుతూ హామీలను విస్మరించి కుటుంబ పాలన కొనసాగిస్తున్నారని భాజపా రాష్ట్రప్రధాన కార్యదర్శి ఆచారి విరుచుకుపడ్డారు. వెల్దండ మండలంలోని బండోనిపల్లి గ్రామంలోగల ఎస్సీ కాలనీలో మంగళవారం భాజపా కార్యకర్తలు, గ్రామస్థులతో కలిసి ఆయన శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో భాజపా మండల అధ్యక్షుడు బాలస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆచారి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైతే ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగులు, వారి తల్లిదండ్రులు ఎంతో ఆశపడ్డారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా ఉద్యోగాలు, పనులను ఆయన కుటుంబానికి, ఆంధ్రావారికి అప్పగిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో తెరాస ప్రభుత్వం అనుసరిస్తున్న అరాచక పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. అనంతరం మండలంలోని రాఘాయిపల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆ గ్రామానికి చెందిన 50 మంది ఆచారి సమక్షంలో భాజపాలో చేరారుఎంపీటీసీ జంగయ్య, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లారెడ్డి, నాయకులు తిరుమలరెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌లు, కృష్ణారెడ్డి, బాలయ్య, పరమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

అక్కడా సమస్యలే!



వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్మశానవాటిక

- టెండర్ల స్థాయిలోనే శ్మశానవాటిక ప్రగతి
- రూ.78 లక్షల నిధుల కేటాయింపు
- చెత్తకు అడ్డాగా మారిన వైనం

వనపర్తి జిల్లా కేంద్రంలో శ్మశానవాటిక సమస్యల్లో కూరుకుపోయింది. అందులో మౌలిక వసతులు కొరవడ్డాయి. ఎలాంటి వసతుల్లేక ప్రజలు దహన సంస్కారాల సందర్భంగా పలు ఇబ్బందులు పడుతున్నారు. నీరు, విద్యుత్తు, రహదారులు, శ్మశానఘాట్లు కొరవడ్డాయి. అస్థికలు ఉంచడానికి ప్రత్యేక గదీ లేదు. దుస్తులు మార్చుకోడానికి వసతుల్లేవు. ఇక్కడ నీటి వసతి లేకపోవడంతో ట్యాంకర్ల తెప్పించే నీటితోనే సరిపుచ్చుకోవాల్సి వస్తోంది.

న్యూస్‌టుడే, వనపర్తి పట్టణం

పట్టణంలోని పాన్‌గల్ రోడ్డును అనుసరించి ఉన్న బీసీ బాలికల వసతిగృహ సమీపంలో హిందూ శ్మశానవాటిక ఉంది. దానికి ప్రత్యేకంగా ప్రహరీ నిర్మించలేదు. దీంతో రక్షణ లేకుండా పోయింది. పురపాలక సంఘంలో సేకరిస్తున్న చెత్తను సైతం అక్కడే వేస్తున్నారు. దీంతో అది డంపింగ్‌యార్డుగా మారిపోతోంది. 14వ ఆర్థికసంఘం నిధుల కింద రూ.78 లక్షలు మౌలిక వసతులకు అవసరమని ప్రతిపాదించడంతో ప్రభుత్వ ఆమోదం లభించింది. ఈ నిధులతో శ్మశాన ఘాట్లు, ప్రహరీ, వెయిటింగ్‌షెడ్లు, స్నానపు గదులు, దుస్తుల మార్పిడి గదులు తదితర వాటికి ప్రతిపాదించారు. ఈ పనులన్నీ టెండర్ల స్థాయిలోనే ఉన్నాయి.

దాతల చేయూత...

శ్మశానవాటికలో దాతలు పలు కార్యక్రమాలు చేపట్టారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సుమారు రూ.3 లక్షలతో రెండు సీసీ రహదారులు, మరో రెండు ఘాట్ల ఏర్పాటుకు పూనుకున్నారు. సంఘం ప్రతినిధులు గోనూరు యాదగిరి, మారం బాలీశ్వరయ్య, నాగబంది యాదగిరి, కె.కృష్ణమూర్తి, వై.వెంకటేశ్, చంద్రుడు, శ్రీనివాసులు, శ్రీధర్, గోకారం రాజు, వజ్రాల సాయిబాబు తదితరుల ఆధ్వర్యంలో సీసీ రహదారుల ఏర్పాటు, ఘాట్లను ఏర్పాటు చేశారు. దాతలు స్పందిస్తే ఇక్కడ ఎదురయ్యే సమస్యలు పరిష్కారమయ్యే అవకాశముంది.


శ్మశానవాటికలో పేరుకుపోయిన చెత్త

త్వరలోనే అభివృద్ధి పనులు : పురపాలక సంఘంలో శ్మశానవాటికలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు నిధులు మంజూరయ్యాయి. 14వ ఆర్థిక సంఘం కింద మంజూరయ్యాయి. టెండర్ల స్థాయిలో ఉన్నాయి. ఈ నిధులతో త్వరలో పలు కార్యక్రమాలు చేపట్టి శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించి సమస్యలు లేకుండా చూస్తాం.

- భాస్కర్, పురపాలక ఇంజినీరు, వనపర్తి

కాలమానిని ఆవిష్కరణ



ఉపాధ్యాయ కాలమానిని ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని జిల్లా విద్యాధికారి కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం పీఆర్టీయూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సరం 2018 కాలమానిని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, ఆర్.శ్రీనివాసులు, నాయకులు శ్రీనివాసరావు, సునీల్, నాగరాజు, హరీష్, గసర్లు, బాలస్వామి, నర్సింహ, కొండారెడ్డి, గోపాల్‌రెడ్డి, పుల్లారెడ్డి, సాయిచందర్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో : జిల్లా కేంద్రంలో మంగళవారం పీఆర్టీయూటీఎస్ ఉపాధ్యాయ సంఘం దినచర్య పుస్తకాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శ్రీనివాస రెడ్డి, శివకుమార్, నాయకులు రవికుమానర్‌రెడ్డి, వరప్రసాదరావు, వరప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, పయ్యావుల కృష్ణయ్య, ప్రసాద్, రామచంద్రయ్య, శ్రీనివాస్, జయంత్‌రెడ్డి, రాజేష్, గోపాల్, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు ; ముగ్గురికి గాయాలు

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : కారు అదుపు తప్పడంతో రోడ్డు పక్కనున్న చెట్టును బలంగా ఢీకొట్టి పల్టీకొట్టిన సంఘటన మంగళవారం ఉదయం బుద్దారం శివారులో జరిగింది. వనపర్తికి చెందిన శ్రీనివాసులు, ఆయన భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులతో కలిసి బిజినపల్లి మండలంలోని వట్టెంకు వెళుతున్నారు. గోపాల్‌పేట శివారు దాటాక బుద్దారం దగ్గర అదుపుతప్పి కుడివైపునకు దూసుకెళ్లింది. రోడ్డు పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టి పల్టీపడింది. ప్రమాదంలో కారులో ఉన్న లక్ష్మికి బలంగా, ఇద్దరు మగపిల్లలకు స్వల్పంగా గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే వనపర్తి ఆసుపత్రికి చికిత్సకు తరలించారు. విషయం తెలిసిన వెంటనే గోపాల్‌పేట ఎస్సై జగన్‌మోహన్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బయటపడని వారెందరో!



జిల్లాకేంద్ర ఆసుపత్రిలో ఐసీటీసీ కేంద్రం

(మొదటిపేజీ తరవాయి) కేంద్రం (పీపీటీసీటీ) అధికారులు హెచ్ఐవీ ఉన్న వారికి మొదలు జబ్బుపై అవగాహన కల్పిస్తారు.

వనపర్తిలోనే అధిక కేసులు..

హెచ్ఐవీ బారిన పడుతున్న వారిలో ఎక్కువ మంది వనపర్తి మండలం, పట్టణాలకు చెందిన వారే ఉన్నారు. 2017 జనవరి నుంచి నవంబరు వరకు మొత్తం 992 మందికి హెచ్ఐవీ పరీక్షలు చేశారు. వీరిలో 509 మంది పురుషులు, 483 మంది మహిళలున్నారు. 24 మందికి నిర్ధరణ అయింది. 13 మంది మహిళలు, 11 మంది పురుషులకు హెచ్ఐవీ ఉన్నట్లు నిర్ధరించారు.

మండలాల వారీగా రోగుల సంఖ్య..

మండలం	పురుషులు	మహిళలు
వనపర్తి	11	13
గోపాల్‌పేట	7	8
ఆత్మకూరు	8	6
కొత్తకోట	7	5
పెబ్బేరు	8	5
ఖిల్లాగణపురం	7	2
పాన్‌గల్	7	5
పెద్దమందడి	3	3
వీపనగండ్ల	2	3
అమరచింత	2	2
చిన్నంబావి	4	3
శ్రీరంగాపూరు	2	4
రేవల్లి	1	3
మదనాపూరు	1	2
ఇతరమండలాలు	15	13
మొత్తం	85	78

వయసు, ఏడాది వారీగా ఇలా..

వయసు	2016	2017
0-14	3	6
15-24	8	13
25-34	53	33
35-49	82	85
50 ఆపైన	25	26
మొత్తం	171	163



హెచ్ఐవీ పరీక్ష చేసే కిట్లు

భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : ఆయా ప్రాజెక్టుల కింద చేపట్టిన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎస్‌కే జోషి అన్నారు. మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులతో ప్రాజెక్టుల కింద చేపట్టిన భూసేకరణ పనులపై దూరదృశ్య సమీక్ష సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పురోగతిలో ఉన్న ప్రాజెక్టులన్నీ జూన్‌లోపు పూర్తి చేసేందుకుగాను ముందుగా పెండింగులో ఉన్న భూసేకరణ పనులను పూర్తి చేయాలన్నారు. అలాగే అందుబాటులో ఉన్న నిధులను అత్యవసర పనులకు వినియోగించుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ శ్వేతా మహంతి మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాలో భూసేకరణకు సంబంధించి పునరావాస కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.47 కోట్లు, భూసేకరణకు రూ.14 కోట్లు కలిసి రూ.61 కోట్లు విడుదల చేయాలని కోరారు. అలాగే 2018 మార్చి వరకు మరో రూ.70 కోట్ల నిధులు అవసరమవుతాయన్నారు. మొత్తం రూ.131 కోట్లు అవసరమన్నారు. జిల్లాలో ఆయా ప్రాజెక్టుల కింద భూసేకరణ పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. సమావేశంలో జేసీ నిరంజన్, డీఆర్‌వో చంద్రయ్య, ఎస్ఈ భద్రప్ప, ఎస్‌డీసీ వెంకటయ్య, ఆర్డీవో చంద్రారెడ్డి, ఈఈ ఉమాపతి పాల్గొన్నారు.

వర్గీకరణ కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

వనపర్తి పట్టణం : ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచాలని ఎంఎస్ఎఫ్ జిల్లా సహ ఇన్‌ఛార్జి రాము డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేసినంత మాత్రాన ప్రభుత్వ బాధ్యత తీరిపోలేదన్నారు. రాష్ట్రం నుంచి అఖిలపక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్లి వర్గీకరణ అమలయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మార్పీఎస్‌పై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని, ఇది సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో జరిగే వర్గీకరణ ఉద్యమాలను ప్రభుత్వం అడ్డుకుంటోందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్, కురుమూర్తి, రమేశ్, ప్రవీణ్, రఘు, జాన్, శివసాయి పాల్గొన్నారు.

చికెన్ ధరలు

	వెన్‌కాబ్	సుగుణ
ఫాంరేటు	96-00	96-00
రిటైల్	118-00	116-00
డ్రెస్డ్	171-00	168-00
స్కిన్‌లెస్	195-00	197-00

పనులు చూడరు.. నాసి కనరు!


కాలువ కట్ట తెగి వృథాగా పోతున్న నీరు (పాతచిత్రం)

(మొదటిపేజీ తరవాయి) నిర్మాణాలు చేపట్టాలి. కాలువ కట్ట ఎత్తును పెంచుతూ నిర్మాణాలు చేపట్టాలి. ఆకృతి నిర్మాణ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా పనులు చేపట్టడంతో నీటి ఉద్ధృతి పెరిగి పెద్దపెద్ద గండ్లు పడుతూ పంట పొలాలు కొట్టుకుపోతున్నాయి.

కనిపించని లైనింగ్ పనులు..

ఆయకట్టు కాలువలకు లైనింగ్ పనులు తప్పనిసరిగా చేపట్టాలి. ఇక్కడ చేపడుతున్న డి-8 కాలువ నిర్మాణంలో ఇప్పటి వరకు లైనింగ్ పనుల ఊసే ఎత్తలేదు. లైనింగ్ లేకపోవడం, కాలువకు సపోర్టు నిర్మాణ పనులు చేపట్టకపోడంతో కాలువకు గండ్లు పడుతున్నాయి.

వేగంగా పనులు చేయడంతోనే..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు వేగంగా పూర్తి చేయాలన్న లక్ష్యంతోనే కాలువకు గండ్లు పడుతున్నాయి. వచ్చే ఏడాది జులై నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. కాలువకు గట్టు గట్టి పడకపోవడంతో నీటి ఉద్ధృతికి గండ్లు పడుతున్నాయి. కాలువలో నీటి సామర్థ్యం ఎక్కువగా ఉండటమూ ఒక కారణమే. దశల వారీగా సమస్యలన్నీ పరిష్కరిస్తాం.

- కృష్ణ, ఏఈ,
డి-8 పనుల పర్యవేక్షకుడు

దేవరకద్ర

కోయిలసాగర్ నీటిమట్టం 27 అడుగులు

కోయిలసాగర్(దేవరకద్ర గ్రామీణం), న్యూస్‌టుడే : జిల్లాలోని మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు కోయిలసాగర్ మంగళవారం సాయంత్రం నాటికి 27 అడుగుల వద్ద నీటినిల్వ ఉందని ప్రాజెక్టు ఈఈ భూపాల్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు కుడి, ఎడమకాల్వ నుంచి నీటి విడుదల కొనసాగుతుందన్నారు. కుడి కాల్వ నుంచి 180 క్యూసెక్కుల నీరు, ఎడమకాల్వ నుంచి 90 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు వదులుతున్నామన్నారు.

దేవరకద్రలో మంగళవారం కూరగాయల ధరలు (కిలో రూ.లలో)




టమాట - రూ.8, పచ్చిమిర్చి - రూ.40, ఆలుగడ్డ- రూ.20, వంకాయలు-రూ.25, క్యారెట్ - రూ.60, దొండకాయ - రూ.40, బీరకాయ - రూ.40, క్యాప్సికం - రూ.50. బెండకాయ- రూ.40, క్యాబేజీ - రూ.40, చిక్కుడు - రూ.45

– న్యూస్‌టుడే, దేవరకద్ర



దేవరకద్ర వద్ద నిలిచిన వంతెన నిర్మాణ పనులు



శిథిలావస్థకు చేరిన దేవరకద్ర వంతెన



బండర్‌పల్లి వాగుపై వంతెన నిర్మాణం

శిథిల వంతెనలతో అవస్థ

- నత్తనడకన పనులు
- గడువులోగా పూర్తయ్యేనా ?

న్యూస్‌టుడే, దేవరకద్ర గ్రామీణం

167వ జాతీయ రహదారిపై ఇరుకైన వంతెనల స్థానంలో నూతన వంతెనలు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం కోట్లాది నిధులు మంజూరు చేసింది. కాని గుత్తేదారుల అలసత్వంతో నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో నిత్యం వందలాది వాహనాలు శిథిలావస్థకు చేరిన వంతెనపై రాకపోకలు సాగిస్తూ వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి వంతెన నిర్మాణాలు వేగవంతం చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

22 నెలలు గడిచినా : కేంద్ర ప్రభుత్వం జడ్చర్ల నుంచి మక్తల్ మండలంలోని ఎలిగండ్ల వరకు ఉన్న 167వ జాతీయ రహదారికి మరమ్మతులు చేయటంతో పాటు, రహదారికి ఇరువైపులా బీటీ ఏర్పాటు, దేవరకద్ర వద్దనున్న వంతెన, దేవరకద్ర - చిన్నచింతకుంట మండలాల మధ్య బండర్‌పల్లి వాగుపై ఉన్న వంతెన నిర్మాణాలకు 2016, ఫిబ్రవరిలో రూ.100 కోట్లకు టెండరు నిర్వహించింది. గుత్తేదారులు రహదారి, వంతెన నిర్మాణాలను 2018, ఫిబ్రవరిలో పూర్తి చేయాల్సి ఉంది. కాని పనులు ప్రారంభమై 22 నెలలు గడిచినా నిర్మాణాలు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. మరో రెండునెలల గడువు మాత్రమే ఉండటంతో పనులు పూర్తయ్యేలా కనిపించటం లేదు.

నిత్యం 400 బస్సుల రాకపోకలు : దేవరకద్ర, రాయిచూర్, నారాయణపేట నుంచి జిల్లాకేంద్రం మీదుగా హైదరాబాద్, షాద్‌నగర్, మహబూబ్‌నగర్, హన్మకొండలకు రోజు 400 బస్సులు తిరుగుతుంటాయి. దీనికితోడు మరో మూడు వేల వరకు సరకు రవాణా చేసే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతమున్న ఇరుకైన వంతెనల మీదుగా వాహనాలు ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నాయి.

కనీస మరమ్మతులు కరవు : ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలకు కనీస మరమ్మతులు కరవయ్యాయి. వంతెన గోడలకు చెట్లు మొలిచి నెర్రలు వచ్చినా పట్టించుకునేవారు కరవయ్యారు. దీంతో వంతెనలు ప్రమాదకరంగా మారాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.



– రాఘవేందర్, నార్లోనికుంట్ల

భద్రత కొరవడింది : బండర్‌పల్లి వంతెనపై వాహన చోదకులకు భద్రత కరవైంది. వంతెనకు ఇరువైపులా ఆనకట్టకు రక్షణ గోడలు లేకపోవటంతో వాహనాలు కొన్నిసార్లు వాగులో పడిపోతున్నాయి. కనీసం సూచికా బోర్డులు కూడా లేవు. వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేసి ఇబ్బందులు తొలగించాలి.



– కురుమూర్తి, డోకూర్

పనులు పూర్తి చేస్తాం :

రహదారి, వంతెన పనులను త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. రహదారి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. వంతెన నిర్మాణాలు కూడా త్వరితగతిన పూర్తిచేసి వాహనదారుల ఇబ్బందులు తొలగిస్తాం.

– రవీందర్ డీఈ, జాతీయ రహదారి

వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

దేవరకద్ర, న్యూస్‌టుడే : పట్టణంలో ఇంటింటా మరుగుదొడ్డి నిర్మించుకునేగా ప్రజలకు అవగాహన కల్పించాలని సర్పంచి శోభ పంచాయతీ సభ్యులకు సూచించారు. మంగళవారం గ్రామపంచాయతీ ఆవరణలో పంచాయతీ ఈవో సుదర్శన్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 3 నెలల పంచాయతీ ఆదాయ వ్యయాలను ఈవో సభలో చదివి వినిపించారు. మూడునెలల ఆదాయం రూ.8,37,103 రాగా పంచాయతీ నిర్వహణ ఖర్చులు రూ. 8,47,625 అయినట్లు వెల్లడించారు. 2018-2019 వార్షిక ప్రణాళిక, బడ్జెట్‌పై చర్చించి గ్రామసభలో ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి రాందాస్, పంచాయతీ సభ్యులు వెంకటేష్, అంబేడ్కర్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి పై చర్చ

మదనాపురం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచి భాగ్యమ్మ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి, చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వెంకట్‌నారాయణ, బాలస్వామి, రంగన్న, సత్యం, జగదీష్, రవీందర్‌రెడ్డి, సాయిలు, రాములు, హనుమాన్‌రావు, చాంద్‌పాషా, చంద్రమ్మ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు వ్యాయామ ఉపాధ్యాయుడి ఎంపిక

కొత్తకోట, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌గౌడ్ జాతీయస్థాయి హ్యామర్ త్రోలో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. డిసెంబర్ 29, 30 తేదీల్లో మంచిర్యాల జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రజత పతకం సాధించారని ప్రధానోపాధ్యాయులు మనోరంజని తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌గౌడ్‌ను ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.



చంద్రశేఖర్‌గౌడ్

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

రామకృష్ణాపురం(కొత్తకోట గ్రామీణం), న్యూస్‌టుడే : ప్రభుత్వం వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్తు సరఫరా చేయటంపై హర్షం వ్యక్తం చేస్తూ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు రాజేశ్వరి, సర్పంచి చెన్నమ్మ, రైతులు మంగళవారం ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నరన్నారు. కార్యక్రమంలో భీంరెడ్డి, జగదీష్, హబీబ్, యుగంధర్‌రెడ్డి, బుచ్చన్న, షేక్ అలీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

మద్యం పట్టివేత

లక్ష్మీపల్లి(దేవరకద్ర గ్రామీణం), న్యూస్‌టుడే : మండల పరిధిలోని లక్ష్మీపల్లికి చెందిన రవిశంకర్ అనుమతి లేకుండా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై అశోక్‌కుమార్ తెలిపారు. అతడి నుంచి 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తపస్ కాలమానిని ఆవిష్కరణ

మూసాపేట, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో తపస్ కాలమానిని ఎంపీపీ బగ్గి కమలమ్మ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజేందర్‌రెడ్డి, ఎంఈవో రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచి భాస్కర్‌చందర్‌గౌడ్, తపస్ జిల్లా నాయకులు కరుణాకర్‌గౌడ్, శోభారాణి, వెంకటస్వామి, రవినాయక్, లక్ష్మీకాంత్, తిరుపతయ్య, నాగమల్లిక, హుస్సేనయ్య, శ్రీనివాస్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

మూసాపేట, న్యూస్‌టుడే : సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీపీ బగ్గి కమలమ్మ అన్నారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆమె ఆయుత ధర్మదీక్ష గోడపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజేందర్‌రెడ్డి, సర్పంచి భాస్కర్‌చందర్‌గౌడ్, ఎంఈవో రాజేశ్వర్‌రెడ్డి, టీఎస్‌సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి, వీఆర్వోల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎండీ ఖదీర్, సీపీఎస్ సంఘం మండలాధ్యక్షుడు రవినాయక్, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కోటిలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని శ్రీ కోటిలింగేశ్వర దత్త దేవస్థానంలో శివుడి జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

స్వామి వారిని దర్శించుకున్న వెన్నెల : మెట్రో రైలు చోదకురాలు వెన్నెల మంగళవారం కానాయపల్లి శ్రీ కోటిలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు జగదీష్, అనిల్, అయ్యప్ప తెలిపారు. వెన్నెలను ఆలయ నిర్వాహకులు సన్మానించారు.



శ్రీ కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో వెన్నెల

సహాయనిధితో బాధితులకు భరోసా - ఎమ్మెల్యే

అన్నాసాగర్(భూత్పూర్), న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సహాయనిధి బాధితులకు భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. అన్నాసాగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం అడ్డాకుల, మూసాపేట, చిన్నచింతకుంట, భూత్పూర్ మండలాల్లోని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైద్యచికిత్స నిమిత్తం ప్రభుత్వం ఆర్థిక సాయం చేయడం బాధిత కుటుంబాలకు ఆసరాగా నిలుస్తోందన్నారు. తాటికొండలోని మహేష్‌కు రూ.40వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొత్తకుర్వ నర్సిములు, రైతు సమన్వయసమితి కన్వీనర్ నర్సిములు గౌడ్, తెరాస మండలాధ్యక్షుడు బస్వరాజుగౌడ్, నారాయణ గౌడ్ తదితరులు ఉన్నారు.



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల

వ్యవసాయ మార్కెట్‌లో ధరలు..

దేవరకద్ర, న్యూస్‌టుడే : దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం విక్రయానికి వచ్చిన వ్యవసాయ ఉత్పత్తులకు లభించిన ధరలను మార్కెట్ కార్యదర్శి భాస్కర్ వివరించారు. 45 క్వింటాళ్ల కందులు రాగా క్వింటా సగటు ధర రూ. 4,450, ఆముదం 6 క్వింటాళ్లు వస్తే క్వింటాకు రూ.4,030 లభించినట్లు వివరించారు.

తెరపై ఈనాడు

దేవరకద్ర, న్యూస్‌టుడే :

దేవరకద్ర : రాఘవేంద్ర – ఎంసీఏ

కొత్తకోట : శ్రీభవాని – ఒక్క క్షణం

శ్రీదేవి – 2 కంట్రీస్ పరమేశ్వరి – ఎంసీఏ

దేవరకద్ర

గిరిజన విద్యార్థులకు దుస్తులు పంపిణీ

అమిస్తాపూర్(భూత్పూర్), న్యూస్‌టుడే : అమిస్తాపూర్ శివారులోని ఎస్టీ, ఎస్సీ వసతిగృహంలోని 40 మంది విద్యార్థులకు మంగళవారం నూతన సంవత్సరం సందర్భంగా ఎస్టీసెల్ నాయకులు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గిరిజన నాయకుడు రామునాయక్, వసతిగృహ నిర్వాహకులు బాల్‌రాజు, బాలకోటి, రవీందర్, మాడా రవి, రవినాయక్, శ్రీను తదితరులు ఉన్నారు.

కన్నులపండువగా సుందరగిరీశుడి నందికోళ్ల సేవ



అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు



జాతరకు భారీగా తరలించిన భక్తులు



పవన్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

అప్పరాల(కొత్తకోట గ్రామీణం), న్యూస్‌టుడే : మండల పరిధిలోని అప్పరాల సమీపంలో సుందరగిరి కొండపై వెలిసిన సుందరగిరి పరమేశ్వరస్వామి నందికోళ్ల సేవ కన్నులపండువగా సాగింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మొదలైన నందికొళ్ల సేవ తెల్లవారుజాము వరకు కొనసాగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు పరమేశ్వరస్వామి, విజయ్‌కుమార్, సంపత్ తెలిపారు. నందికోళ్ల సేవ అనంతరం భక్తులు అగ్నిగుండంలో నడిచారు. ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తటంతో ఆలయం కిటకిటలాడింది. జాతరకు ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, కర్నూలు, కర్ణాటక ప్రాంతాలకు చెందిన భక్తులు వచ్చారు. దర్శనం అనంతరం కాల్చిన కూర దుకాణాల వద్ద సందడి నెలకొంది. జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు, కొడిపందెలు ఆడకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

స్వామివారిని దర్శించుకున్న పవన్ : మండల పరిధిలోని అప్పరాల సమీపంలో వెలిసిన సుందరగిరి పరమేశ్వరస్వామిని మంగళవారం కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ బాధ్యుడు డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న పవన్‌కుమార్‌రెడ్డికి ఆలయ అర్చకులు విజయ్‌కుమార్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు విశ్వేశ్వర్, సర్పంచి మాసన్న, ఎంపీటీసీ సభ్యురాలు అనిత, నాయకులు వీరేష్, కృష్ణారెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, బోయేజ్, సాయిల్‌యాదవ్, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, సుభాష్, వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కురుమూర్తి, శ్రీకాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మదనాపురం, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ జిల్లాలోని బోయపల్లిలో గుర్తుతెలియని దుండగులు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినందుకు నిరసనగా మండల కేంద్రంలో మంగళవారం అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు రహదారిపై బైఠాయించారు. మండల అధ్యక్షుడు జగదీశ్వర్ మాట్లాడుతూ.. జాతికి మేలు చేసిన మహనీయుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాగేందర్, అశోక్, సురేష్, శివ, రాములు, అక్షయ్, సత్యనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

మదనాపురం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలను ఎంపీటీసీ సభ్యుడు వెంకట్‌నారాయణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తన సొంతఖర్చుతో 10వ తరగతి విద్యార్థులు 106 మందికి స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలు పంపించారని వాటిని విద్యార్థులకు అందజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి భాగ్యమ్మ, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణయ్య, మండల రైతు సమన్వయకర్త హనుమాన్‌రావు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, తెరాస నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలకు పనిభారం తగ్గించాలి

కొత్తకోట, న్యూస్‌టుడే : ఆశ కార్యకర్తలకు పనిభారం పెంచుతూ శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆశ కార్యకర్తల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు భాగ్య ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.6 వేలు వేతనంగా చెల్లిస్తామని ప్రకటించి ఇప్పటికీ అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశ కార్యకర్తలకు దుస్తులు, ఉద్యోగుల మాదిరి ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, బకాయిల్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నిక్సన్, కార్యకర్తలు మంజుల, సంతోష, పుష్ప, గీత, స్వాతి, రజిత, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

వంతెన లేక అవస్థ



వాగు దాటుతున్న ప్రజలు

పెద్దరాజమూర్(దేవరకద్ర గ్రామీణం), న్యూస్‌టుడే : మండల పరిధిలోని పెద్దరాజమూర్ - పుసల్‌పహాడ్ గ్రామాల మధ్య ఉన్న వాగుపై వంతెన లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలరోజులుగా కోయిలసాగర్ నీటిని ఆయకట్టుకు విడుదల చేయటంతో పంట పొలాలకు వెళ్లే నీరు వాగులోకి వచ్చి చేరుతుంది. వాగులో నీటి ప్రవాహం ఉండటంతో రెండు గ్రామాల ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. వంతెన నిర్మించాలని పలుమార్లు కోరినా అధికారులుగానీ, ప్రజాప్రతినిధులుగానీ పట్టించుకోవటం లేదని ఇరు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

బహుజనుల ఐక్యతే టీ మాస్ లక్ష్యం

భూత్పూర్, న్యూస్‌టుడే : దళిత బహుజనుల ఐక్యతే లక్ష్యమని టీ మాస్ జిల్లా కమిటీ సభ్యులు కురుమూర్తి, గులాంగౌస్ అన్నారు. మండల కేంద్రంలోని భగీరథ బాలల వికాస కేంద్రంలో మంగళవారం టీ మాస్ మండల సన్నాహక సమావేశం నిర్వహించారు. బలహీనవర్గాల ప్రజలను ఒక్కటి చేసేందుకు బుధవారం గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం మండల కన్వీనర్‌గా ఏశమోని శ్రీనివాసులు, కో-కన్వీనర్‌గా మండి అంజిలను ఎన్నుకున్నారు.

ఆసుపత్రి ప్రసవాలను ప్రోత్సహించాలి

భూత్పూర్, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలను ప్రోత్సహించాలని పీహెచ్‌సీ వైద్యురాలు డా. సునీతారెడ్డి అన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశ కార్యకర్తల సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రామయ్య, పర్యవేక్షకులు యాదమ్మ, రమేష్, ఏఎన్ఎంలు ఉన్నారు.

మరుగుదొడ్ల లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

వెల్కిచర్ల(భూత్పూర్), న్యూస్‌టుడే : స్వచ్ఛభారత్ అభియాన్‌లో భాగంగా వెల్కిచర్లలో మరుగుదొడ్లు నిర్మించుకున్న 30 మంది లబ్ధిదారులకు ప్రోత్సాహక చెక్కులను సర్పంచి నాగన్న మంగళవారం అందజేశారు. మరుగుదొడ్ల నిర్మాణంతోపాటు వినియోగంలోనూ అందరు చొరవ చూపాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి గోపీ, క్షేత్రసహాయకులు నారాయణగౌడ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మండల పరిషత్తులో నూతన సంవత్సర వేడుకలు

భూత్పూర్, న్యూస్‌టుడే : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ సుకన్య నూతన సంవత్సరం- 2018 కేకు కోసి అన్నివర్గాల ప్రజలకు మంచి జరగాలని ఆకాంక్షించారు. జడ్పీటీసీ చంద్రమౌళి, ఎంపీడీవో గోపాల్‌నాయక్, నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో..

చిన్నచింతకుంట : మండల పరిధిలోని పర్దీపూర్, కురుమూర్తి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. కురుమూర్తి గ్రామంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పర్దీపూర్‌లో సర్పంచి కోట రాము కేకు కోసి విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చిన్నరాములు, విజయకృష్ణ, నాయకులు ఎర్రన్న, స్వామి పాల్గొన్నారు.

స్వచ్ఛతపై కళాజాత ప్రదర్శన



పాటలు పాడుతున్న కళాజాత బృందం

కౌకుంట్ల(దేవరకద్ర గ్రామీణం), న్యూస్‌టుడే : మండల పరిధిలోని కౌకుంట్లలో స్వచ్ఛతపై కళాజాత బృందం గ్రామస్థులకు అవగాహన కల్పించారు. బహిరంగ మల విసర్జనతో వచ్చే ఇబ్బందులపై ఆటపాటలతో ప్రదర్శనలు ఇచ్చారు. ప్రతి ఇంటా మరుగుదొడ్డి నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి హరగోపాల్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రానికి భారీగా కందులు రాక

దేవరకద్ర, న్యూస్‌టుడే : దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రానికి మంగళవారం సుమారు 2,600 బస్తాల కందులు విక్రయానికి వచ్చినట్లు కొనుగోలు కేంద్రం ఇన్‌ఛార్జి శ్రీనివాసులు తెలిపారు. రైతులు తెచ్చిన కందులను పూర్తిస్థాయిలో కాంటా చేసి లారీల్లో తరలించినట్లు వివరించారు.

వేరుశనగ క్వింటా రూ.4,689



మార్కెట్‌కు వచ్చిన వేరుశనగ రాశులు

మదనాపురం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో వేరుశనగ క్రయ విక్రయాలు కొనసాగుతున్నాయి. వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం రైతులు 174 క్వింటాళ్ల వేరుశనగ తీసుకొచ్చినట్లు మార్కెట్ పర్యవేక్షకుడు విజయచందర్ తెలిపారు. క్వింటా గరిష్ఠంగా రూ. 4,689 కనిష్ఠంగా రూ. 3,216 ధర లభించిందని ఆయన పేర్కొన్నారు. మార్కెట్ సిబ్బంది రాములు, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

తిర్మలాయపల్లి(మదనాపురం), న్యూస్‌టుడే : మండల పరిధిలోని తిర్మలాయపల్లిలో మంగళవారం జాతీయ పోషకాహార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి శారద మాట్లాడుతూ.. కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులు తగిన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారికి కోడిగుడ్లు, బాలమృతం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సుజాత, అంగన్‌వాడీ కార్యకర్త పద్మ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



ఓటింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

కురుమూర్తి(చిన్నచింతకుంట), న్యూస్‌టుడే : కురుమూర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. 7వ తరగతిలో ఎన్నికలపై పాఠ్యాంశం ఉండటంతో విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యత, ఎన్నికల గురించి వివరిస్తూ మాక్ పోలింగ్ నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు చిన్నరాములు తెలిపారు. పోటీ చేసే విధానం, ఓటు వేసే విధానం, ఓటింగ్ తీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ఖలీల్, మాధవి, అరుంధతి, గౌతమి పర్యవేక్షించారు.

బలవంతంగా భూములు లాక్కొంటే ఉద్యమిస్తాం

- 2013 చట్ట ప్రకారం భూ సేకరణ చేయాలి
- సీపీఎం నేత, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి



నిర్వాసితుల సదస్సులో మాట్లాడుతున్న నంద్యాల నర్సింహారెడ్డి

గోకారం(చారకొండ), న్యూస్‌టుడే : జలాశయాల నిర్మాణం పేరుతో ప్రభుత్వం రైతుల భూములను బలవంతంగా తీసుకొంటోందని, ఇలా చేస్తే ఉద్యమాలు చేపడతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి హెచ్చరించారు. మంగళవారం నాగర్‌కర్నూలు జిల్లా చారకొండ మండలం గోకారంలో డిండి ఎత్తిపోతల పథకం నిర్వాసితులకు అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోకారం జలాశయం కింద 900 ఎకరాలు, వెల్దండ మండలం ఎర్రవెల్లి, ఎర్రవెల్లి తండా శివారులో మరో 550 ఎకరాలను పూర్తిగా ముంచి, ఇతర ప్రాంతాలకు సాగునీరు తరలించడం అన్యాయమని అన్నారు. గ్రామ సభలు నిర్వహించకుండా, తీర్మానం చేయకుండా, కనీసం రైతులకు సమాచారం ఇవ్వకుండా భూములు సేకరించడం సరికాదని అన్నారు. రైతుల వద్ద ఉన్న కొద్ది భూములు కూడా తీసుకొని, వారిని గ్రామాల నుంచి తరలించేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతుల నుంచి భూములు సేకరించాలని, భూమికి భూమి, ఇంటికో ఉద్యోగం, ఇంటికి ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచి గోజి రెడ్యానాయక్, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మమ్మ, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మానాయక్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు ఆంజనేయులు, మల్లేశ్, బాలస్వామి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు 24 గంటల విద్యుత్తు చరిత్రాత్మక నిర్ణయం



రైతులతో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

మోజర్ల(పెద్దమందడి), న్యూస్‌టుడే : రైతాంగానికి 24 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేయడం చరిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని మోజర్లలో పల్లె నిద్ర చేసి మంగళవారం గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడారు. గ్రామంలోని చెరువును ఆయన పరిశీలించారు. శంకరసముద్రం కుడి కాలువ నుంచి నీరు పెద్దమందడి, కొత్తకోట, దేవరకద్ర, అడ్డాకుల మండలాల్లోని 10 వేల ఎకరాలకు సాగునీరు అందుతోందని, మధ్యలో గండ్లు కొట్టడంతో చివరి ఆయకట్టుకు నీరందకుండా పోతోందన్నారు. కాలువకు గండ్లు కొట్టకుండా చూడాలని నీటిపారుదలశాఖ ఇంజినీర్లను ఆయన చరవాణిద్వారా ఆదేశించారు. సమైక్యాంధ్ర పాలనలో తెలంగాణ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని, ముఖ్యమంత్రి కేసీఆర్ నీటిపారుదల ప్రాజెక్టులను అనుకున్న కాలంలోగా పూర్తి చేస్తారన్నారు. వచ్చే వానాకాలం నాటికి వనపర్తి నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని తెలిపారు. బుద్ధారం కుడి కాలువ నిర్మాణ పనులు పూర్తయితే పెద్దమందడి మండలంలోని పలు గ్రామాల్లో సాగు, తాగునీటి సమస్య తీరుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దయాకర్, జడ్పీటీసీసభ్యుడు గోపాలకృష్ణ, మద్దిగట్ల ఎంపీటీసీసభ్యుడు సత్యారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు జగదీశ్వర్‌రెడ్డి, తెరాస నాయకులు రామకృష్ణారెడ్డి, రఘుపతిరెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

నేడు ఆల్ హమాలీ సంఘం జిల్లా మహాసభ

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : పెబ్బేరు మండలంలోని రంగాపురంలో బుధవారం ఆల్ హమాలీ సంఘం జిల్లా మహాసభ జరుగుతుందని సీఐటీయూ అనుబంధ సంఘం శాస్త్రా బయే ఫ్యూయల్ ప్రైవేటు లిమిటెడ్ హమాలీ సంఘం ప్రతినిధులు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మండ్ల రాజు, పుట్టా ఆంజనేయులు, నాయకులు బాలయ్య, ఎన్.రాములు తెలిపారు. హమాలీల సమస్యల పరిష్కారానికి చేపట్టబోయే ఈ మహాసభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

30 పోలీసు చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు

వనపర్తి ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

వనపర్తి : వనపర్తిలో శాంతియుత వాతావరణానికి భంగం కలిగించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసు పర్యవేక్షణ అధికారిణి రోహిణీ ప్రియదర్శిని మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో 30 పోలీసు చట్టం అమల్లో ఉందని, పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి ఊరేగింపులు, సభలు, సమావేశాలు జరపరాదని, మైకులను వినియోగించడం చట్టవిరుద్ధమని తెలిపారు. లేదంటే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. అమాయక ప్రజలు, ప్రజాస్వామ్య పద్ధతిలో నడుచుకునేవారికి పోలీసుశాఖ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. పూర్తిస్థాయిలో వారికి సహాయపడుతుందని, అనాగరిక చర్యలు, గొడవలకు దిగి వాతావరణాన్ని కలుషితం చేయరాదని హెచ్చరించారు. జిల్లాలో పోలీసు బలగాల బందోబస్తుతోపాటు ప్రత్యేక పోలీసుల నిఘా నిరంతరం ఉందన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిగురించి సమాచారాన్ని సమీపంలోని పోలీసులకు వెంటనే అందించాలని ఆమె సూచించారు.

ఏఎస్సైకి పోలీసు సేవా పతకం



ఏఎస్సై ఆవంచ కృష్ణయ్య

ఉప్పునుంతల : ఇటీవలే ఏఎస్సైగా పదోన్నతి పొందిన ఆవంచ కృష్ణయ్య నాగర్‌కర్నూలు జిల్లా నుంచి పోలీస్ సేవా పతకానికి ఎంపికయ్యారు. ఉప్పునుంతల ఠాణాలో పనిచేస్తున్న ఆయనను కొంతకాలంగా జిల్లా ఎస్పీ కంట్రోలుకు అటాచ్ చేశారు. అక్కడ కోర్టు లైజన్ అధికారిగా విధులను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు గతంలో ఆయన చేసిన కోర్టు విధుల్లోనూ బాగా పనిచేయడంతో పోలీస్ ఉన్నతాధికారులు సేవా పతకానికి ఎంపిక చేశారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టించడంలో ఆయన చూపిన చొరవ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌లోనూ ప్రజలతో మమేకం అయిన తీరుతో ఆయనకు ఈ పతకం వరించింది. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం రోజున ఆయన పతకం అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మోహన్‌బాబు, పోలీస్ సిబ్బంది మంగళవారం ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే టీమాస్ లక్ష్యం



మాట్లాడుతున్న దేవేందర్

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా సంఘం ఉద్యమాలను చేపడుతోందని తెలంగాణ ప్రజాసంఘాల ఐక్య వేదిక(టీమాస్) జిల్లా కన్వీనర్ దేవేందర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సంఘం నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ, ఓబీసీ వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతర ఉద్యమాలను చేపడుతూ ప్రజాచైతన్యం తీసుకెస్తున్నామన్నారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సంఘం ఆధ్వరంలో ఈనెల 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జనంలోకి టీమాస్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగే సంఘం జనంలోకి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కురుమయ్య, రాములు, రమేశ్, పుట్టా ఆంజనేయులు, ఎన్.రాములు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లోనే హేతుబద్ధీకరణ చేపట్టాలి / పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్టీయూ నేతలు

ఉప్పునుంతల, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఉపాధ్యాయులు, పాఠశాలల హేతుబద్ధీకరణ చేపడతామని ప్రకటించిందని, విద్యా సంవత్సరం మధ్యలో కాకుండా వేసవి సెలవుల్లో చేపట్టాలని పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.మల్లికార్జున్, రాష్ట్ర కార్యదర్శులు పూజారి పురుషోత్తం, వెంకటేశ్వర్‌రావు కోరారు. నాగర్‌కర్నూలు జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యా సంవత్సరం మధ్యలో హేతుబద్ధీకరణ చేపట్టడం ద్వారా ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. దీనిలో ఏజెన్సీ ప్రాంతాలకు, చెంచుపెంటలకు, ఉర్దూ మాధ్యమాలకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిషన్‌ను ఈ నెలలోనే ఏర్పాటు చేసి, ఐఆర్ ప్రకటించి జులై వరకు పీఆర్సీ అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉప విద్యాధికారుల పోస్టులను పునరుద్ధరించాలని అన్నారు. పాఠశాలల్లో చిన్న విషయాలకు డీఈవో ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. ఉపాధ్యాయులు తప్పిదాలు చేస్తే శ్రీముఖాలు, షోకాజులు ఇచ్చి తర్వాత కూడా పద్ధతి మారకపోతే చర్యలు తీసుకోవాలని, ఎలాంటి హెచ్చరికలు లేకుండానే సస్పెండ్ చేయడం తగదన్నారు. సమావేశంలో సంఘం నేతలు జగదీశ్వర్‌రెడ్డి, విజయ్‌కుమార్, ఎన్.నర్సింహారెడ్డి, సుమిత్రా బాయి, రాంచంద్రారెడ్డి, బస్వయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పులుల గణన / ఎఫ్‌డీ వినోద్‌కుమార్




ఉప్పునుంతల(బికె) అటవీ ప్రాంతంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎఫ్‌డీ

అమ్రాబాద్, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ అభయారణ్య ప్రాంతంలో పెద్ద పులుల గణన కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అటవీశాఖ క్షేత్ర సంచాలకులు (సీఎఫ్) వినోద్‌కుమార్ సూచించారు. ఈ నెల 22 నుంచి వారం రోజులపాటు టైగర్ రిజర్వుడు ప్రాంతంలో నిర్వహించనున్న పెద్ద పులుల గణనకు సంబంధించి క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనులు పరిశీలించేందుకు మంగళవారం అమ్రాబాద్ మండలంలోని ఉప్పునుంతల (బీకే), అమ్రాబాద్ బీట్‌లను సందర్శించారు. అఖిల భారత స్థాయిలో నాలుగేళ్లకు ఒకసారి పెద్ద పులుల గణన నిర్వహిస్తారని చెప్పారు. పులుల గణన కోసం ఏర్పాటు చేసే కాలిబాటలను, శాకాహార జంతువుల గణన కోసం లోతట్టు ప్రాంతంలో ఏర్పాటు చేసే ట్రాన్సెక్ట్ లైన్లను పరిశీలించారు. కాలిబాటలను సరిచేయాలని కొన్ని సూచనలు చేసి, మిగతా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అమ్రాబాద్‌లోని రేంజ్ కార్యాలయాన్ని పరిశీలించారు. భవనాన్ని ఆధునీకరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారికి సూచించారు. కార్యక్రమంలో అమ్రాబాద్ అటవీ డివిజన్ అధికారి వెంకటేశ్వర్లు, రేంజ్ అధికారి ప్రభాకర్, డీఆర్వో లక్ష్మీకాంత్, ఎస్‌వో మల్లేష్, ఎఫ్‌బీవోలు శివ, నాగేష్ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులకు రెండు పడక గదుల ఇళ్లు ఇవ్వాలి

సంఘం జిల్లా అధ్యక్షుడు మాందాపురం కృష్ణయ్య

జంగమాయపల్లి(పెద్దమందడి), న్యూస్‌టుడే : జిల్లాలోని నాయీబ్రాహ్మణులకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెండు పడక గదుల ఇళ్లు ఇవ్వాలని జిల్లా నాయీబ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు మాందాపురం కృష్ణయ్య కోరారు. మంగళవారం జంగమాయపల్లిలో సంఘం మండల సమావేశం జరిగింది. అలాగే నాయీబ్రాహ్మణులకు అర్హులైన వారికి పింఛను సౌకర్యమూ కల్పించాలని కోరారు. ఇతరత్రా సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. సమావేశంలో సంఘం జిల్లా, మండల నాయకులు వెంకటేశ్, రమేశ్, పాండు, శ్రీనివాసులు, విశ్వనాథం, సత్యం, వెంకటస్వామి, నిరంజన్, నర్సింహ, చంద్రమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సంఘం జిల్లా అధ్యక్షుడితోపాటు మండల కార్యవర్గసభ్యులను ఈ సందర్భంగా సన్మానించారు.




నాయీబ్రాహ్మణ సేవాసంఘం నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

రిజిస్ట్రేషన్లపై ఐటీ శాఖ కన్ను

● రూ.30 లక్షలు పైబడిన లావాదేవీలపై నజర్

● అంత ఆదాయం ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై ఆరా



స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా చర, స్థిరాస్తులకు సంబంధించిన లావాదేవీలపై ఆదాయ పన్ను శాఖ దృష్టి సారించింది. క్రయ విక్రయాల్లో రూ.30 లక్షల కంటే ఎక్కువ ఆదాయం కల ఆస్తులపై ఆరా తీయనుంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 2016-17 ఏడాదికి సంబంధించిన పూర్తి వివరాలను తమకు కావాలని రిజిస్ట్రేషన్లకు ఐటీ శాఖ కోరింది. దీంతో ఆయా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గతేడాదికి సంబంధించిన పూర్తి వివరాలను ఇటీవల జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి రాష్ట్ర కార్యాలయానికి పంపించారు. ఆస్తులు కొనుగోలు చేసినవారితోపాటు అమ్మిన వారి వివరాలను సమగ్రంగా సేకరించారు. ఆస్తులను అమ్మినవారు ఆదాయ పన్ను చెల్లించారా, లేదా కొనుగోలు చేసిన వారు ఎక్కడ నుంచి అంత డబ్బును సేకరించారు, రుణం తీసుకున్నారా.. లేదా తమ సొంత డబ్బును వినియోగించారా, ఆదాయపన్ను చెల్లించారా.. లేదా ఇతరులా అనే అంశాలపై ఐటీ శాఖ దృష్టి పెట్టనుంది.

ఉమ్మడి జిల్లాలో వివిధ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రూ.30 లక్షల కంటే ఎక్కువ మొత్తంలో లావాదేవీలు జరిగిన వివరాలు ఇలా..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	నమోదైన దస్తావేజులు
మహబూబ్‌నగర్	540
గద్వాల	131
జడ్చర్ల	74
ఆత్మకూర్	74
కల్వకుర్తి	69
ఆత్మకూర్	52
వనపర్తి	37
నాగర్ కర్నూల్	30
అచ్చంపేట	15

● కొల్లాపూర్‌లో 12, నారాయణపేటలో 2, మక్తల్‌లో 1 దస్తావేజు నమోదయ్యాయి


మహబూబ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేస్తున్న సబ్ రిజిస్ట్రార్లు

న్యూస్‌టుడే, పాలమూరు

గతేడాదికి సంబంధించిన విలువ ఎక్కువున్న లావాదేవీల దస్తావేజులను ఈ నెల 15 వరకు రాష్ట్ర కార్యాలయానికి పంపించాలని స్టాంపులు- రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ జిల్లా రిజిస్ట్రార్‌కు ఉత్తర్వులను జారీ చేశారు. కాని దీనిపై నాలుగు జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్లు సకాలంలో దస్తావేజుల వివరాలను ఐటీకి పంపించలేదు. దీంతో రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్ట్రార్‌తోపాటు సబ్ రిజిస్ట్రార్లపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు రాష్ట్ర కార్యాలయానికి జిల్లా నుంచి తగిన సమాచారాన్ని పంపించారు. అయితే నిర్ణీత గడువులోగా సమాచారాన్ని పంపక పోవడం వల్ల సబ్ రిజిస్ట్రార్లపై జరిమానాలను విధించారు. రోజుకు రూ.వంద చొప్పున జరిమానాలను విధించగా, సబ్ రిజిస్ట్రార్ల సంఘం నాయకులు డీఐజీని కలిసి తమపై విధించిన జరిమానాలను ఉపసంహరించాలని వినతి పత్రాన్ని అందించారు. దీనిపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

సమాచారాన్ని రాష్ట్ర కార్యాలయానికి పంపించాం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.30లక్షల కంటే ఎక్కువ విలువున్న లావాదేవీల వివరాలను రాష్ట్ర కార్యాలయానికి నివేదికను సమర్పించాం. ఎక్కువ ఖరీదైన భూములు, ఇళ్లు, ఫ్లాట్లు, తదితర వాటి గురించి వారు విచారణ చేస్తారు. లావాదేవీలపై తగిన ఆధారాలను సేకరించి తద్వారా వారు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించే అవకాశాలు ఉన్నాయి.

- మల్లారెడ్డి, జిల్లా స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఉమ్మడి జిల్లా అధికారి

పట్నంబాటతో పెరుగుతున్న విలువ..

ఉమ్మడి జిల్లాలో పట్టణీకరణ పెరుగుతోంది. ప్రధానంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అనేక బహుళ అంతస్తుల ఇంటి నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇందులో ఉన్న ఫ్లాట్ల ధరలు రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు వీటిని కొనుగోలు చేస్తున్నారు. విదేశాల్లో ఉన్నవారు కూడా ఈ ఫ్లాట్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. పిల్లల చదువుల కోసం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు కూడా పట్నం బాట పడుతున్నారు. దీంతో వారు కూడా ఫ్లాట్లు కొనుగోలు చేసి ఉండడంపై దృష్టి పెడుతున్నారు. మహబూబ్‌నగర్‌తో పాటు హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్న జడ్చర్ల, కల్వకుర్తి, కర్నూల్‌కు దగ్గరగా ఉన్న గద్వాలలో కూడా బహుళ అంతస్తుల నిర్మాణాలు, ఫ్లాట్ల క్రయవిక్రయాలు పెరిగాయి.

వైద్యమండలి బిల్లు అప్రజాస్వామికం : ఐఎంఏ

వీరన్నపేట (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం వైద్య వృత్తి ప్రమాణాలను దెబ్బ తీసేవిధంగా అప్రజాస్వామికంగా వైద్య మండలి బిల్లును రూపొందించిందని ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డా.రాంమోహన్ ఆరోపించారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లో మధ్యాహ్నం వరకు ఓపీ సేవలను నిలిపివేసిన వైద్యులు అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో డా.రాంమోహన్ మాట్లాడుతూ ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను తీసివేసి నేషనల్ మెడికల్ కౌన్సిల్‌ను తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం బిల్లును తీసుకు వస్తోందని అన్నారు. దీని కారణంగా నామినేట్ పోస్టుల్లో వైద్యులు కాని వారు ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉందని చెప్పారు. దీంతో వైద్యులపై వారి పెత్తనం పెరుగుతుందని, ప్రజలకు అందించే మెరుగైన వైద్య సేవలకు అవాంతరాలు ఏర్పాడుతాయని అన్నారు. బిల్లులో సవరణలు చేయాలని ఐఎంఏ తరపున ఆందోళనలు చేస్తున్నప్పటికి ప్రభుత్వం పట్టించుకోకుండా బిల్లును చర్చించేందుకు ముందుకు తీసుకు వచ్చిందని చెప్పారు. దేశవ్యాప్తంగా ఐఎంఏ ఆందోళనల నేపథ్యంలో వెనక్కి తగ్గి స్టాండింగ్ కమిటీకి బిల్లును పంపించిందని అన్నారు. అయిదు సంవత్సరాలు ఎంబీబీఎస్‌తోపాటు హౌస్‌సర్జన్‌గా సేవలు అందించిన తర్వాత ప్రాక్టీస్ చేసుకునేందుకు వైద్య విశ్వవిద్యాలయాలు అనుమతులు ఇస్తుండగా, హోమియోపతి చదివిన వారికి ఒక ఏడాది పాటు శిక్షణ ఇచ్చి ఎంబీబీఎస్ వైద్యులు అందించే వైద్య సేవలను అందించేందుకు అనుమతి ఇవ్వడం సరికాదని చెప్పారు. కేంద్రం దిగి వచ్చే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని అన్నారు. సమావేశంలో ఐఎంఏ జిల్లా ప్రధాన కార్యదర్శి డా.సంపత్, సభ్యురాలు డా.ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

డీజీపీ పర్యటన ఏర్పాట్లలో అధికారులు

మహబూబ్‌నగర్ (నేరవిభాగం) : జిల్లాలో త్వరలో రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ మేరకు పోలీసు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పాత ఎస్పీ కార్యాలయానికి అధికారులు రంగులు వేయిస్తున్నారు. దీంతోపాటు ఈ-లెర్నింగ్ కేంద్రం, కమాండ్ కంట్రోల్ గదులను సైతం డీజీపీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. డీజీపీ హెలికాప్టర్‌లో జిల్లాకు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో డీఎస్పీ భాస్కర్ మంగళవారం పరిశీలించారు. ఇప్పటి వరకు ఆయన పర్యటనపై ఎలాంటి స్పష్టత రాలేదు. అయితే రెండు మూడు రోజుల్లో పర్యటన ఉంటుందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

ప్రాజెక్టులకు రూ.192 కోట్లు అవసరం : కలెక్టర్

మహబూబ్‌నగర్ అర్బన్ : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం భూ సేకరణ, పరిహారం చెల్లింపునకు గాను పాలమూరుకు రూ.192 కోట్లు అవసరమని జిల్లా కలెక్టర్ రొనాల్డ్‌రోస్ రాష్ట్ర అధికారులకు నివేదించారు. రాష్ట్ర నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్‌కే. జోషి మంగళవారం రాష్ట్ర నీటిపారుదలశాఖ ఇంజినీర్ ఇన్ ఛీఫ్ మురళీధర్‌తో కలిసి జిల్లా అధికారులతో దూరదృశ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి చివరి నాటికి పాలమూరు ఎత్తిపోతల పథకానికి సంబంధించిన భూ సేకరణ వందశాతం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈఈలు భూపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రంగారెడ్డి, రాంప్రసాద్, రవీంద్రకిషన్, మధు, బాలకృష్ణ, కలెక్టరేట్ జీ-విభాగం పర్యవేక్షకుడు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో పాల్గొనండి


ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందితో ఎస్పీ, అదనపు ఎస్పీ తదితరులు

మహబూబ్‌నగర్ (నేరవిభాగం), న్యూస్‌టుడే : పోలీసు శాఖలో సీనియర్లు చక్కటి సేవలు అందించారని, అలాంటి వారి సేవలను కోల్పోవడం శాఖకు వెలితియేనని జిల్లా ఎస్పీ డా.బి.అనురాధ తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్ఐ దేశియానాయక్, హెడ్‌కానిస్టేబుల్ సిరాజుద్దీన్‌లను ఎస్పీ సన్మానించారు. తక్కువ స్థాయిలో సదుపాయాలు ఉన్న సమయంలో శాఖకు మంచి పేరు తీసుకువచ్చే విధంగా పని చేశారని అన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత కుటుంబానికి సమయం ఇవ్వడంతోపాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. అవసరమైన సందర్భాల్లో సీనియర్‌ల సేవలను వినియోగించుకుంటామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ గిరిబాబు, పీఆర్వో మన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

● విశ్రాంత పోలీసు అధికారుల సంఘం నాయకులు ఎస్పీని మంగళవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సంఘం నాయకులతో కలిసి ఎస్పీ కేక్ కోశారు. విశ్రాంత పోలీసు అధికారుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఇస్తానని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ భాస్కర్, విశ్రాంత ఉద్యోగులు సాయిరెడ్డి, రాజయ్య, కృష్ణుడు, రాఘవరెడ్డి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా.. గురుకుల విద్యార్థులకు ఆరోగ్య పరిశుభ్రత కిట్‌లు



విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసే వస్తువులు

వీరన్నపేట (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే : జిల్లాలోని కేజీబీవీ.. గురుకుల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య పరిశుభ్రత కిట్‌లు అందజేస్తోంది. ప్రస్తుతం విద్యార్థులకు ప్రతి నెలా రూ.100 కాస్మోటిక్ ఛార్జీలను ఇస్తుంది. దీని స్థానంలో ప్రతి మూడు నెలలకోసారి ఆరోగ్య పరిశుభ్రత కిట్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. అందులో విద్యార్థులకు అవసరమైన అన్ని వస్తువులను ఇస్తున్నారు. నాలుగు సబ్బులు, రెండు దుస్తులు ఉతికే సబ్బులు, పౌడర్, టూత్‌బ్రష్, పేస్ట్, నాలుక శుభ్రం చేసే పరికరం, 24 షాంపులు, నూనె, బొట్టు, రెండు మీటర్ల రిబ్బన్, రబ్బర్ బ్రాండ్లు నాప్‌కిన్లు, హ్యాండ్‌వాష్, దోమల బెడద తగ్గించేందుకు ఎలక్ట్రికల్ పరికరాన్ని ఇస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో కిట్‌ల రూపంలో వస్తువులను ఇస్తున్నారు. ప్రస్తుతం ఇస్తున్న కిట్‌లతో పోలిస్తే ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్న కిట్లు సరిగ్గా లేవని అధికారులు గుర్తించారు. రాష్ట్ర విద్యా శాఖ సంచాలకులు కిషన్‌తో మాట్లాడి పాత కిట్‌లనే సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. త్వరలోనే కిట్‌ల విషయంలో ఓ నిర్ణయం తీసుకునేందుకు అవకాశం ఉంది. ప్రభుత్వం తరపున ఇస్తున్న నేపథ్యంలో బుధవారం లాంఛనంగా రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి డా.లక్ష్మారెడ్డి చేతుల మీదుగా కిట్‌లను రాజాపూర్‌లో విద్యార్థులకు అందించనున్నారు.

పక్షికింత ధాన్యం.. పశువుకింత గ్రాసం.. మనిషికింత సాయం.. జీవితాన్ని సార్థకం చేసుకోవటానికి చేయాల్సిన పనులివే.. నిజమైన సంతృప్తిని ఇచ్చే కార్యాలివే.. తమవంతుగా సమాజానికి ఏదైనా చేయాలని ఆలోచించిన అయిజ పట్టణానికి చెందిన ఈ సోదరులు ఇదే పనిచేస్తున్నారు. విద్య, ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ వాటిలో సంతృప్తి వెతుక్కుంటున్నారు.

- న్యూస్‌టుడే, అయిజ

సేవలో సంతృప్తి

- విద్యార్థులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు బాసట
- ఆదర్శంగా నిలుస్తున్న అయిజ సోదరులు



కంప్యూటర్లను అందిస్తున్న అప్పా ఫౌండేషన్ ఛైర్మన్ మల్లికార్జున్

అయిజకు చెందిన చెందిన సోదరులు మల్లికార్జున్, వీరశైవ సమాజం మండల అధ్యక్షుడు బస్వరాజ్, న్యాయవాది శ్రీనాథ్, రమేశ్‌లకు సామాజిక సేవ కార్యక్రమాలంటే ఇష్టం. తమ తండ్రి గాండ్ల జగదీశప్ప జ్ఞాపకార్థం అప్పా ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. ఛైర్మన్‌గా మల్లికార్జున్, మిగిలిన ముగ్గురు సభ్యులుగా కొనసాగుతున్నారు. పిల్లల చదువుతోనే పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మారుతాయని నమ్మిన వారు విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. విద్యార్థులకు చేయూత ఇస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే దేవాలయాల మండపాల నిర్మాణాలు, తాగునీటి సరఫరా, దుస్తుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.

- ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తిచేసిన అయిజకు చెందిన మల్లికార్జున్ కుమారుడు నవీన్ ఆర్థిక ఇబ్బందులతో రెండో సంవత్సరం చదువును నిలిపేశాడు. విషయం తెలుసుకున్న అప్పా ఫౌండేషన్ నిర్వాహకులు స్థానిక హరిహర కళాశాలలో చేర్పించి ఖర్చు మొత్తం భరించారు. ఇలా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న విద్యార్థుల సమాచారం తెలుసుకుంటూ చేయూత ఇస్తున్నారు.
- విద్యార్థుల వివరాల నమోదులో ఎదురవుతున్న ఇబ్బందులను ఎంఈవో ద్వారా తెలుసుకుని కంప్యూటర్లను అందించారు. వీరశైవ సమాజం విద్యార్థులకు, కేశవరంలోని యూపీఎస్ తోపాటు పలు బళ్ల విద్యార్థులకు పాఠశాల కిట్లు అందించారు.
- పదో తరగతి విద్యార్థులు సాయంత్రం వేళలో చదువుకునే సమయంలో అర్ధాకలితో ఉండకుండా అల్పాహారం ఏర్పాటు చేశారు. అయిజలో తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేపట్టారు. ముస్లింలకు రంజాన్ వేళలో దుస్తులను పంపిణీ చేస్తున్నారు.
- తూంకుంటలో 16 స్తంభాల బసవేశ్వరస్వామి ఆలయాన్ని పునర్నిర్మించారు. అయిజలోని జములమ్మ ఆలయానికి మండపాన్ని నిర్మించారు. చాకలిపేటలో నిర్మిస్తున్న మడియాళప్ప ఆలయానికి పైకప్పు నిర్మించారు. రాజోలిలోని అడివేశ్వరస్వామి ఆలయానికి స్థలాన్ని విరాళంగా ఇచ్చారు.



అయిజలో విద్యార్థులకు నిఘంటువులను అందజేస్తూ..

- ఏటా 100 మంది విద్యార్థులకు శిక్షణ
- బాదేపల్లి పాఠశాలలో స్ఫూర్తిదాయకం
- రాష్ట్ర, జాతీయ స్థాయి శిబిరాల్లో విద్యార్థుల ప్రతిభ

ఎన్‌సీసీ.. ఆసక్తి జాస్తి

ఎన్‌సీసీ అంటేనే ఆ పాఠశాల విద్యార్థుల్లో ఆసక్తి మెండు.. అవకాశం దొరికితే చాలని వారు ఎదురు చూస్తుంటారు.. క్రమశిక్షణ, ఐక్యమత్యం అలవరిచే ఈ శిక్షణలో చేరడాన్ని గర్వంగా భావిస్తుంటారు.. బాదేపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు..

- న్యూస్‌టుడే, జడ్చర్ల పట్టణం





పాఠశాలలో కవాతు చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

ఉమ్మడి జిల్లాలోనే బాదేపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువ. ఏటా 1,350 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతుంటారు. ఈ పాఠశాలలో 1964 సంవత్సరంలో ఎన్‌సీసీ ప్రారంభించగా, మొదటి నుంచి ఇక్కడ విద్యార్థులు చేరడానికి ఆసక్తి చూపేవారు. ప్రస్తుతం ఏటా వందమంది విద్యార్థులు చేరుతుండగా రాష్ట్ర, జాతీయస్థాయి శిబిరాలో కనీసం 10 మంది విద్యార్థులు ప్రతి సంవత్సరం పాలుపంచుకుంటున్నారు.

ఎన్‌సీసీలో శిక్షణలివే: ఎన్‌సీసీలో వార్షిక శిక్షణ శిబిరం, తల్‌సైనిక్, జాతీయ సమైక్యత, జాతీయ సాహస యాత్ర శిబిరం, స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ శిబిరాలు, ఎన్‌సీసీ డే శిబిరం, ఇంటర్ గ్రూప్ శిబిరం ఉంటాయి. వీటిలో క్యాడెట్స్‌కు డ్రిల్, రైఫిల్ ఫైరింగ్, సాంస్కృతిక, సమాజ సేవ కార్యక్రమాలు, మొక్కలు నాటడం, పరిశుభ్రత నిర్వహణపై అవగాహన కల్పిస్తారు. శిక్షణను బట్టి ధ్రువపత్రాలు అందజేశారు. విద్య, ఉద్యోగ రంగాల్లో అవకాశం లభిస్తుంది.




సైన్యంలో చేరుతా : మాది గద్వాల పట్టణం. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నా. ఎన్‌సీసీ అంటే ఆసక్తితో చేరాను. సైన్యంలో చేరాలన్నది నా లక్ష్యం. అందుకు ఎన్‌సీసీ మార్గంగా ఉపయోగపడుతుందని నా భావన. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన జాతీయ ట్రెక్కింగ్ శిబిరంలో పాల్గొని మెలకువలు సాధించాను. పర్వతారోహణ, అటవీ ప్రాంతంలో కాలినడకతో శారీరక సామర్థ్యంపై అవగాహన పెంచుకున్నా. లోపాలు తెలుసుకున్నా. వాటిని అధిగమించి సైన్యంలో చేరడానికి ఇప్పటి నుంచే ప్రయత్నం చేస్తా.

- ఆనంద్



అసోం శిక్షణ శిబిరానికి ఎంపిక : మాది భూత్పూర్ మండలం కొత్తూర్ గ్రామం. తొమ్మిదో తరగతి చదువుతున్న నేను ఎనిమిదో తరగతిలోనే ఎన్‌సీసీలో చేరా. మిలటరీలో చేరాలన్నది నా కోరిక. జనవరి 3 నుంచి 12 వరకు అసోంలో నిర్వహించే జాతీయ స్థాయి ఎన్‌సీసీ శిబిరానికి ఎంపికయ్యా. గ్రామీణ ప్రాంత విద్యార్థిగా జాతీయ స్థాయి శిబిరంలో అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ శిబిరంలో పలు అంశాలపై పట్టు సాధించి మిలటరీలో చేరాలన్న నా కలకు బాటలు వేసుకుంటా.

-అశోక్



కాంస్య పతకం సాధించా : మాది జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లి పంచాయతీలోని కొత్త తండా. పదో తరగతి చదువుతున్నా. ప్రాథమిక స్థాయిలోనే ఎన్‌సీసీలో చేరాను. డిసెంబరు 15 నుంచి 24 వరకు వరంగల్ జిల్లాలో నిర్వహించిన జాతీయ స్థాయి సమైక్యత శిబిరంలో పాలుపంచుకున్నాను. శిబిరంలో ఆల్‌రౌండర్‌గా పని చేశాను. ఇతర రాష్ట్రాల క్యాడెట్లతో ఎలా మెలగాలి, ఆచార వ్యవహారాలు, జాతీయ సమైక్యత భావం తదితర అంశాలను నేర్చుకున్నా. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సత్తా చాటాను. ఈ శిక్షణలో కాంస్య పతకం సాధించాను. సైన్యంలో చేరాలన్న నా కోరికకు ఎన్‌సీసీ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతోంది.

- రాజేశ్‌నాయక్



పరేడ్ కమాండర్‌గా చేశా : మాది జడ్చర్ల పట్టణం. తొమ్మిదో తరగతి చదువుతున్నా. నవంబరు నెలాఖరులో సికింద్రాబాద్ బైసన్ మైదానంలో రాష్ట్ర స్థాయి ఎన్‌సీసీ శిబిరంలో పాల్గొన్నా. ఎన్‌సీసీ డే సందర్భంగా పరేడ్ కమాండర్‌గా పని చేశా. ఫైరింగ్, డ్రిల్‌లో ముందున్నా. క్రమశిక్షణ నేర్పే ఎన్‌సీసీ అంటే నాకెంతో గౌరవం. అందుకే మా సీనియర్ విద్యార్థులను చూసి ఇందులో చేరాను. జాతీయ స్థాయి ఎన్‌సీసీ శిబిరంలో పాల్గొనడమే లక్ష్యంగా శిక్షణ పొందుతున్నా.

- అరుణ్‌కుమార్



జాతీయ స్థాయి శిబిరమే లక్ష్యం : తిమ్మాజిపేట మండలం బావాజీపల్లి మా స్వగ్రామం. తొమ్మిదో తరగతి చదువుతున్నా. ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఎన్‌సీసీ కవాతు చేస్తుంటే చూసి ఆసక్తి కలిగింది. ఉన్నత పాఠశాలలో చేరినప్పుడే ఎన్‌సీసీ కావాలని అడిగాను. పాఠశాల స్థాయిలో వివిధ శిబిరాల్లో పాల్గొంటున్నా. నవంబర్‌లో సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఎన్‌సీసీ రాష్ట్ర స్థాయి శిబిరంలో పాల్గొన్నా. కవాతు, ఫైరింగ్, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నా. రాష్ట్ర స్థాయిలో అవకాశం రావడం ఆనందం అనిపించింది. జాతీయ స్థాయిలో రాణించి పాఠశాలకు మంచి పేరు తేస్తాను.

- నరేందర్‌గౌడ్



ఉప్పల్ ఇండోర్ స్టేడియంలో తలపడుతున్న శ్రీరాంసింగ్ రాథోడ్

- జాతీయ స్థాయికి గిరిజన యువకులు
- 8 నుంచి 10 వరకు కోల్‌కతాలో పోటీలు

తైక్వాండోలో నల్లమల చిరుతలు

న్యూస్‌టుడే, అచ్చంపేట

ఒకపక్క చదువు.. మరోపక్క ఆసక్తి ఉన్న తైక్వాండోలో శిక్షణ. ఒక ప్రణాళికాతో సాధన చేసి ప్రతిభ చాటుకుంటున్నారు గిరిజన యువకులు. అచ్చంపేటలోని షిటిరియో కరాటే శిక్షణా కేంద్రంలో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. రాష్ట్రస్థాయిలో సత్తాచాటి.. ఈ నెల కోల్‌కతాలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఉన్నత విద్యాభ్యాసం చేసినా ఆసక్తి ఉన్న ఆత్మరక్షణ విద్యను మరచి పోలేదు.

రాష్ట్రస్థాయిలో సత్తాచాటి ..: అచ్చంపేటకు చెందిన యువకులు శ్రీరాంసింగ్ రాథోడ్, రాజు నాయక్ తైక్వాండో పోటీల్లో రాణిస్తున్నారు. తైక్వాండో రాష్ట్ర అధ్యక్షుడు టి.బాలరాజు ఆధ్వర్యంలో డిసెంబరు 12న హైదరాబాద్‌లోని ఉప్పల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. ఇద్దరూ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు కోల్‌కతా ఈడెన్ గార్డెన్ మైదానంలో నిర్వహించనున్న 37వ జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొననున్నారు.

ప్రతిభను చాటిన కూలీ బిడ్డ..



శ్రీరాంసింగ్ రాథోడ్

అచ్చంపేట పట్టణంలోని గోకుల్‌నగర్ కాలనీకి చెందిన దశరథం, బోడమ్మ దంపతులు కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి కుమారుడు శ్రీరాంసింగ్ రాథోడ్ చిన్నప్పటి నుంచి కరాటేపై ఉన్న ఆసక్తితో శిక్షణ తీసుకుంటున్నాడు. ఒకవైపు చదువుపై ఆసక్తి చూపుతూనే.. తైక్వాండోలో రాణిస్తున్నాడు. డిగ్రీ, బీఎడ్ పూర్తి చేసి ప్రస్తుతం పీజీ చదువుతున్నా.. పేదరికం వెంటాడుతున్నా లక్ష్య సాధనకు అంకిత భావంతో కృషి చేస్తున్నాడు. 2014 నవంబరులో అప్పటి కరీంనగర్ జిల్లా జగిత్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. 2017 మార్చి 27న హైదరాబాద్ కూకట్‌పల్లిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకాన్ని అందుకున్నాడు. డిసెంబరు 12న హైదరాబాద్‌లో తైక్వాండో రాష్ట్ర అధ్యక్షుడు టి.బాల్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభను చాటుకోవడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 8 నుంచి 10 వరకు కోల్‌కతాలో నిర్వహించే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొననున్నాడు.

జాతీయ స్థాయికి ఎంపిక..



పతకం అందుకొంటున్న రాజునాయక్ (పాతచిత్రం)

అచ్చంపేటకు చెందిన మరో గిరిజన యువకుడు రాజునాయక్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యాడు. కోల్‌కతాలో నిర్వహించే పోటీల్లో పాల్గొనేందుకు శిక్షణ పొందుతున్నాడు. తైక్వాండో జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మొదటి సారి 2012లో కర్ణాటక రాష్ట్రం హంపి, జమ్మూ కశ్మీర్‌లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొన్నాడు. 2013 దిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నా పతకం రాలేదు. అయినా నిరాశ చెందక 2014లో దిల్లీలో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో రెండో స్థానంలో నిలిచి వెండి పతకాన్ని సొంతం చేసుకున్నాడు. 2015 పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ చాటుకొని బంగారు పతకం సొంతం చేసుకొన్నాడు. 2016 ముంబైలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభచాటి మరో బంగారు పతకం తన ఖాతాలో వేసుకొన్నాడు. గత నెల హైదరాబాద్‌లోని ఉప్పల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటుకోవడంతో కోల్‌కతాలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు మరోసారి ఎంపికయ్యాడు.



తరగతి గదిలో బోధన చేస్తున్న విద్యార్థిని

- ఆసక్తి ఉన్న రంగాల్లో విద్యార్థినులకు తర్ఫీదు
- నైపుణ్యం ఆధారంగా క్లబ్ ఏర్పాటు
- ఆంగ్లంలో ప్రత్యేక శిక్షణ

గురుకులం.. నవ్యపథం

చదువుతో పాటు విద్యార్థులో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు గురుకులాలు సరికొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. విద్యార్థుల చేతనే ప్రత్యక్షంగా పాఠ్యాంశాన్ని వివిధ పద్ధతుల ద్వారా బోధించడంతో పాఠ్యాంశంపై సమగ్రంగా అవగాహన కలగడంతో పాటు వారు నిజజీవితంలో అన్వయించుకోవడానికి కొత్త కార్యక్రమాలు దోహద పడనున్నాయి. భవిష్యత్తులో వారికి ఇష్టమైన రంగంలో రాణించేందుకు కసరత్తు చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, మరికల్

మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో 32 గురుకులాలు ఉండగా 14 వేల మంది విద్యార్థిని, విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠ్యాంశాలపై ఆసక్తి కలిగించేందుకు, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడేలా ప్రోత్సాహం అందిస్తున్నారు. ఇందులో భాగంగా 20 క్లబ్ యాక్టివిటీ, ఫ్లిప్పుడ్ క్లాసెస్' కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకుసాగుతున్నారు.

వివిధ రంగాల్లో శిక్షణ : '20 క్లబ్ యాక్టివిటీ' కార్యక్రమం ద్వారా ఆసక్తి ఉన్న రంగంలో విద్యార్థులు రాటు దేలేందుకు అమలు చేస్తున్నారు. విద్యార్థుల నైపుణ్యం ఆధారంగా ఒక్కో క్లబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఏర్పాటు చేసిన క్లబ్‌లో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు 32 మంది విద్యార్థులు ఉంటారు. క్లబ్ యాక్టివిటీ కార్యక్రమాలు ప్రతి శనివారం 3:30 నుంచి 4:30 గంటల వరకు నిర్వహిస్తారు. ఒక్కో క్లబ్‌కు ఇద్దరు లేదా ముగ్గురు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులకు చిత్రలేఖనం, నృత్యం, సంగీతం, నటన, జనరల్ నాలెడ్జి తదితర వాటిలో తర్ఫీదు ఇస్తుంటారు. వీటి పనితీరు, ఉపయోగాలు వివరిస్తూ విద్యార్థులకు ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తుంటారు.

ఈ ప్లస్ క్లబ్ : ఈ ప్లస్ క్లబ్ కార్యక్రమాన్ని ప్రతి సోమవారం, మంగళవారాల్లో 3.30 నుంచి 4:30 గంటల మధ్యలో జరుపుతారు. తరగతి వారీగా ఆంగ్లంలో మాట్లాడించేందుకు సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి రోజు ఒక అంశం ఇస్తారు. ఆ అంశంలో అనర్గళంగా ఆంగ్లంలో మాట్లాడించేందుకు విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. దీంతోపాటు గణితం, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టుల్లో బేసిక్స్ నేర్చుకుని అభివృద్ధి సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. శుక్రవారం తరగతి వారీగా క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారు.

విద్యార్థి కేంద్రంగా బోధన

తరగతిలో బోధన ప్రక్రియ ఉపాధ్యాయుడి చేతుల్లో నుంచి విద్యార్థుల చేతుల్లోకి వస్తుంది. 'ఫ్లిప్పుడ్ క్లాసెస్' కార్యక్రమం కింద బోధన అభ్యాసన ప్రక్రియ సాగుతోంది. బోధన పద్ధతిని అనుసరించి విద్యార్థి క్విజ్, ప్రశ్నలు, చర్చ, తదితర కృత్యాలను ఒకరోజు ముందు నేర్చుకుని తరగతి గదిలోకి వస్తారు. ఉపాధ్యాయుడు మార్గదర్శిగా ఉండి విద్యార్థుల చేతనే బోధన చేయిస్తారు.

అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి

గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతో పాటు అదనంగా అన్ని రంగాల్లో రాణించేందుకు క్లబ్ యాక్టివిటీ కార్యక్రమాలు అమలవుతున్నాయి. ఫ్లిప్పుడ్ క్లాస్ ద్వారా విద్యార్థులకు ఉపాధ్యాయులు పక్కన ఉండి విద్యార్థులచే బోధన చేయిస్తారు. చదువుతో పాటు వారికి ఆసక్తి ఉన్న అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేస్తున్నాం.

- ఫ్లారెన్స్‌రాణి, ఉమ్మడి జిల్లా గురుకులాల సమన్వయకర్త



అవగాహన పెరుగుతుంది.. : కొత్త కార్యక్రమాల నిర్వహించడంతో పాఠ్యాంశాలపై పట్టు సాధిస్తున్నాం.. క్విజ్, చర్చ, ఏకపాత్రాభినయం, కృత్యాలు చేయడంతో అన్ని అంశాలపై పూర్తి అవగాహన వస్తుంది.. దీంతో పాటు నేర్చుకున్న అంశాలు ఎక్కువ కాలం గుర్తుండిపోతాయి. .కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం.. ప్రయోగాలను ప్రత్యక్షంగా చేస్తున్నాం..

- అంకిత, పదో తరగతి, మరికల్ గురుకులం

ఆటే ప్రాణం.. విజయమే లక్ష్యం

హాకీలో సత్తా చాటుతున్న వనపర్తి వాసులు

ఒకప్పుడు వనపర్తిలో క్రీడలంటే పెద్దగా పరిచయం ఉండేది కాదు. క్రికెట్ ఒక్కటే అందరికీ తెలిసిన ఆట. 15 ఏళ్లుగా వనపర్తి జిల్లాలో క్రికెట్ తరవాత అంత గుర్తింపు ఉంది హాకీ క్రీడకు మాత్రమే. ఎంతో మంది హాకీలో ఉత్తమ ప్రతిభ చూపుతూ జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటున్నారు. పేదరికాన్ని సైతం లెక్కచేయకుండా పట్టువీడని విక్రమార్కుల్లా క్రీడను ఒంటబట్టించుకొని గెలుపు తలుపులను తడుతున్నారు. జిల్లాలోని పలువురు క్రీడాకారుల అభిప్రాయాలు వారి మాటల్లోనే.

- న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్



హాకీ ఆడుతున్న దృశ్యం



రైల్వేలో ఉద్యోగం సాధించాలని.. : క్రీడల కోటాలో రైల్వేలో ఉద్యోగం సంపాదించాలని చిన్ననాటి నుంచే హాకీ క్రీడలో శిక్షణ పొందాను. ఇప్పటికే హరియాణా, పంజాబ్, దిల్లీ, జార్ఖండ్‌లలో జరిగిన నాలుగు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఏడు రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించా. ప్రస్తుతం హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నా. జాతీయ స్థాయిలో బహుమతి పొంది రైల్వేశాఖలో ఉద్యోగం చేయాలన్నది లక్ష్యం.

- చంద్రకాంత్, ఆత్మకూరు



నాలుగు జాతీయస్థాయి పోటీల్లో సత్తా..: నాలుగేళ్లుగా హాకీలో శిక్షణ పొందుతున్నా. రాంచీ, హరియాణా, పంజాబ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ జట్టులో ఆడాను. వనపర్తి, నల్గొండ, రంగారెడ్డి, మెదక్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి పతకాలను సాధించా. మరింత సాధన చేసి భారత జట్టులో స్థానం సంపాదించాలని అనుకుంటున్నా.

- సునీత, వనపర్తి



భారత జట్టులో స్థానం సంపాదిస్తా.. : హరియాణా, పంజాబ్, రాంచీలో జరిగిన జాతీయ స్థాయి హాకీ పోటీల్లో ఆడాను. వనపర్తి, నల్గొండ, మెదక్, కరీంనగర్, వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించా. హాకీలో ఉత్తమ ప్రతిభ కనబర్చి భారత జట్టులో స్థానం సంపాదించాలని ఉంది. నా చిన్ననాటి నుంచే వ్యాయామోపాధ్యాయులు ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నా. భవిష్యత్తులో పీఈటీగా సేవలందించాలని ఉంది.

- కవిత, పాలెం, కొత్తకోట



ఎస్సై కావాలని ఉంది..: యూపీ, బెంగళూరులో జరిగిన హాకీ జాతీయస్థాయి పోటీల్లో ఆడాను. వనపర్తి, రంగారెడ్డి, నల్గొండ, కరీనంనగర్, మెదక్, ఖమ్మం జిల్లాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించాను. వ్యాయామోపాధ్యాయులు ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకున్నందుకే నాకు రాష్ట్రస్థాయిలో పతకాలు వచ్చాయి. భవిష్యత్తులో ఎస్సై కావాలని ఉంది.

- భారతి, దొంతికుంటతండా, ఖిల్లాగణపురం



భారతజట్టుకు ప్రాతినిధ్యం వహించేలా శిక్షణ..: రెండేళ్లుగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు నుంచి 26 మంది క్రీడాకారులు జాతీయస్థాయిలో జరిగిన హాకీ పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన పలు పోటీల్లో మొదటి స్థానాన్ని సాధించారు. భవిష్యత్తులో జిల్లా క్రీడాకారులు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించేలా వారికి శిక్షణనిస్తున్నాం.

- కుమార్, పీడీ



అనగనగా ఓ ఊరుంది... అక్కడంతా బోలెడు వజ్రాలు.... ఎన్నంటే టన్నులకు టన్నులు... ఏ గోడ చూసినా వజ్రాలే... ఏ గుంజ చూసినా అవే... అయితే వాటిని ఎవ్వరూ తియ్యరు... అస్సలు పట్టించుకోరు... ఎందుకో? ఏంటో?

తళుకుల్ బెళుకుల్... ఊరంతా వజ్రాల్!

ఎక్కడైనా వజ్రాలు దొరుకుతాయంటే అంతా వెళ్లి గబగబా ఏరేసుకుందాం అనుకుంటాం. అయితే ఓ చిన్న టౌనుంది. ఎక్కడంటే జర్మనీలో. చూస్తే మామూలు టౌనుల్లానే ఉంటుంది ఇదీనూ. ఇక్కడ బోలెడన్ని వజ్రాలుంటాయి. ఎన్నంటే ఏకంగా 72,000 టన్నుల వరకూనట. అయినా చిత్రంగా వాటిని ఎవ్వరూ పట్టించుకోరు.

■ ఈ ఊరి పేరు నోర్డ్లింగన్. వజ్రాల్ని పొదుముకున్న టౌననీ దీన్ని పిలుస్తారు. ఇక్కడుండే గోడలు, దుమ్ము... ఇలా అన్ని చోట్లా వజ్రాలు నిక్షిప్తమై ఉంటాయి. కావాలని ఎవరూ వీటినిలా నిక్షిప్తం చెయ్యలేదు.

■ తొమ్మిదో శతాబ్దానికి ముందు నుంచే ఇక్కడ నివాసాలు ఉన్నాయి. అయితే అందుకు పూర్వం ఇక్కడ ఒక అగ్నిపర్వత బిలం ఉండేది. 15 మిలియన్ సంవత్సరాల క్రితం ఇక్కడో గ్రహ శకలం వచ్చి భూమిని బోలెడు ఒత్తిడితో ఢీకొంది.

■ దీంతో అక్కడ రసాయన సమ్మేళనాలు జరిగి చాలానే ఖనిజాలు పుట్టాయి. వీటిల్లో వజ్రాలూ ఉన్నాయి. అయితే అవి మైక్రోస్కోప్‌లో పెట్టి చూస్తే గాని కనిపించనంత బుల్లి బుల్లి రేణువుల్లా ఉంటాయి. ఇక్కడి దుమ్ముల్లో కలిసిపోయి ఉంటాయి.

■ కనీసం కంటికి కనిపిస్తే వాటిని మనం ఆభరణాల్లోనో, మరో విధంగానో వాడుకుంటాం. కానీ రేణువుల్లా కంటికి కనిపించకుండా ఉండే వాటిని ఏం చేసుకుంటాం. అందుకే వాటికి మార్కెట్ విలువా అంతంత మాత్రమే.

■ అందుకే వీటిని ఇక్కడ ఎవ్వరూ పట్టించుకోరన్నమాట. అయితే రెండో ప్రపంచ యుద్ధం సమయంలో జర్మనీలో భీకర వాతావరణం ఉండేది. ఎప్పుడూ యుద్ధాలు జరుగుతుండేవి. ఈ ఊరిని రక్షించుకునేందుకు ఇక్కడి వారు ఆ పక్క పక్కన దొరికే ఇసుక, మట్టిని ఉపయోగించి గోడలు కట్టుకున్నారు. దానితోనే ఇక్కడ కొన్ని ఇళ్లు కూడా కట్టుకున్నారు.

■ సూర్యరశ్మి ఎప్పుడైనా ఏటవాలుగా ఆ గోడలపై పడితే వజ్రాలు ధగధగమని మెరుస్తూ మనకు కనిపిస్తాయి తప్ప ఒట్టిగా అయితే అవి కనే కనిపించవు.

■ ఇక్కడి అగ్ని పర్వత బిలం దాదాపుగా 25 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండేదట. దీంతో ఆ చోటంతా ఇలా చిన్న రేణువుల్లాంటి వజ్రాలు నిక్షిప్తమయ్యాయట.

■ ఈ వివరాలన్నీ తెలిపేలా ఇక్కడ ఒక మ్యూజియం కూడా ఉంది. పేరు రైస్ క్రేటర్ మ్యూజియం. ఆ అగ్ని పర్వతం పేరు మీదే దీనికీ పేరు పెట్టారు.

■ దీంతో ఈ చిత్రమైన ఊరుని, మ్యూజియంని చూడటానికి ఇక్కడికి ఏటా బోలెడు మంది పర్యాటకులు వస్తుంటారు. తమాషాగా ఉన్న ఈ వివరాలన్నీ వినడానికైతే భలేగా ఉన్నాయి కదూ!



■ వజ్రాలు చిన్న చిన్న రాళ్లలా కాకుండా ఇలా రేణువుల్లా ఎందుకు మారిపోయాయబ్బా? అని ఎవ్వరికైనా సందేహం కలుగుతుంది కదూ! అంతకు ముందు ఇక్కడ గ్రహశకలం పడటం వల్ల పుట్టిన ఒత్తిడికే ఇవిలా రేణువుల్లా మారిపోయాయని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి.

హాయ్ బుజ్జీ!!

నేర్చుకుందాం!

ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.

Bomb - బామ్

Climb - క్లైమ్

ఆణిముత్యం

శక్తి అనేది డబ్బులో లేదు, మంచితనం, పవిత్రతల్లో ఉంటుంది

- స్వామి వివేకానంద

చిటపట చినుకులు!

కథ

పిల్లగాలి తెమ్మెరొకటి రాలడానికి సిద్ధంగా ఉన్న వాన చినుకుతో కబుర్లకు దిగింది. మబ్బులోని ఆ చినుకు దిగాలుగా ఉంది. కారణమడిగిన గాలితో 'ఎక్కడ రాలతానో, నా బతుకేంకానుందో' అంది దిగులుగా. 'చక్కగా మట్టిలోనో, చెరువులోనో పడతావంతేగా' అంది గాలి.

'అంటే పురుగులు, క్రిములు ఉండే మట్టిలోకో, నాచు నిండిన చెరువులోకో పడి పతనం కావాలా నేను?' అంది చినుకు ఏడుపు ముఖంతో.

'పోనీ ఏ వేడి పదార్థంపైనో పడి ఆవిరవుదువుగానీలే' అంది గాలి ఓదార్పుగా. 'అంటే పుట్టి క్షణం గడవకముందే బతుకు కడతేరిపోతుందా?' అంది చినుకు గాభరాగా.



'ఏమో! ముత్యపు చిప్పలో పడే అదృష్టం పొందుతావేమో దిగులెందుకు' అంది గాలి.

'అంటే నింగిలో స్వేచ్ఛగా విహరించిన నన్ను చిప్పలోను, తర్వాత నగలో పొదిగి బంధీగా పడి ఉండమనా?' అంది చినుకు ఉక్రోషంగా. దాని దిగులును పోగొట్టే ఆఖరి ప్రయత్నంగా గాలి 'పోనీ తళతళమంటూ స్వచ్ఛంగా తామరాకు మీద నిల్చుందువులే' అంది.

'ఛీ.. నిలిచి ఉన్న ఆకునైనా తాకలేని బతుకూ ఓ బతుకేనా?' అంది చినుకు చీదరింపుగా.

సంతోషమే లేని ఆ చినుకు ధోరణికి గాలి నిట్టూర్చింది. పక్కకు చూసింది. ఎంతో కుతూహలంతో నేలను తాకాలని తహతహలాడుతోంది ఓ చినుకు. దాని ముఖమంతా ఉత్సాహం పరుచుకుని ఉంది. ఆశ్చర్యంతో దాన్ని పలకరించింది గాలి.

'నీకు మట్టిలో కలిసిపోతానని భయం లేదా?' అడిగింది.

'ఎందుకూ! అప్పుడు నేను మట్టిలో ఖనిజ లవణాల్ని కరిగించుకుంటాను. చెట్లు నన్ను పీల్చుకోగానే వాటిని అందించగలను. ఎంత మంచి అవకాశం' అంది చినుకు కులాసాగా.

'మరి ఏ వేడి వస్తువుపైనో పడి వెంటనే ఆవిరైపోతే' అంది గాలి.

'మరీ మంచిది. మళ్లీ నింగిలోకి ప్రయాణం. మబ్బు తునకలో భాగంగా స్వేచ్ఛా విహారం' అంది చినుకు తేలిగ్గా.

'ముత్యపు చిప్పలో పడి ముత్యమైపోతావేమో, నింగికెగిరే అవకాశం లేకుండా' అంది గాలి జాలిగా.

'ఆహా! ఎంత భాగ్యం. అప్పుడే కదా. జన్మకు సార్థకత. శాశ్వతత్వం' అంది చినుకు మురిసిపోతూ.

'తామరాకుపై నిలుస్తావనిపిస్తోంది నాకు' అంది గాలి చివరిగా.


'ఎంత చల్లని మాట చెప్పావ్. స్వచ్ఛతను కోల్పోని సంతోషపు బతుకు అప్పుడు' అంది చినుకు చలాకీగా.

ఆ ఆలోచనా ధోరణికి ముగ్ధురాలైంది గాలి. 'ఒకే మబ్బులో పుట్టిన రెండు చినుకులకీ ఎంత తేడా ఉంది? ఆనందమో, విచారమో... మన బతుకు తీరు తేల్చేది మన ఆలోచన విధానమే కదా' అనుకుంది గాలి.

- గుడిపూడి రాధికారాణి


నీడేది?

మొదటి బొమ్మ నీడను పట్టుకోండి



సబ్జెక్ట్ ల్యాబ్ గణితం

బొమ్మలు, అంకెలు, గుర్తుల్ని బట్టి లెక్క చేయగలరా?



జవాబులు: స్కూల్ సవాల్: 1. జాన్ లోగీ బెయిర్డ్ 2. సహారా ఎడారి 3. మైఖేల్ ఫారడే నీడేది: 2 సబ్జెక్ట్ ల్యాబ్- గణితం: 22 (నీలం గ్లాసు-8, పసుపు గ్లాసు-20, ఎర్ర గ్లాసు-10)

కలర్‌టీవీని కనిపెట్టిందెవరు?

స్కూల్ సవాల్

1. కలర్‌టీవీని కనిపెట్టిందెవరు?
2. ప్రపంచంలో అతి పెద్ద ఎడారి?
3. డైనమోని కనిపెట్టిందెవరు?



- డీఎస్ రాజేష్, పదో తరగతి, ఎస్‌కేఆర్ఇఎమ్ స్కూల్, గోరంట్ల, అనంతపురం జిల్లా

మక్తల్

ఘనంగా ఉర్సు వేడుకలు

కల్వాల(నర్వ), న్యూస్‌టుడే : మండలంలోని కల్వాల గ్రామంలో మంగళవారం ఉర్సు వేడుకలను గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక దర్గా వద్ద పూల అలంకరణ, గంధోత్సవ ఊరేగింపునకు ప్రజలు భారీ ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక సర్పంచి ప్రమీల వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ రత్నమ్మవిజయ్, గ్రామ పెద్దలు మహేశ్వర్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు.

టీకాలతో వ్యాధుల దూరం

కొత్తపల్లి(కృష్ణా), న్యూస్‌టుడే : మాగనూరు మండలంలోని అన్ని గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డా.మదన్‌మోహన్ తెలిపారు. మంగళవారం కొత్తపల్లిలో పశువైద్య శిబిరం నిర్వహించి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా మంది రైతులకు ఈ టీకాల గురించి తెలియడం లేదన్నారు. వ్యాధి రాక ముందే టీకా వేయిస్తే చాలా మేలు కలుగుతుందన్నారు. రైతుల పాడి పశువులకు కావాల్సిన గడ్డి విత్తనాలు మాగనూరు పశువైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచి అంజప్పగౌడ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు తీవ్రం.. పరిష్కరించాలి సత్వరం

వాట్సాప్ నంబరు : 80085 73841

మండలంలో నెలకొన్న సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనాడు వాట్సాప్ పిలుపునకు ప్రజల నుంచి స్పందన వస్తోంది. వాట్సాప్‌కు వచ్చిన సమస్యలను 'ఈనాడు.. మీతోడు' ఆధ్వర్యంలో అధికారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తోంది.

– న్యూస్‌టుడే, అమరచింత

అసంపూర్తిగా సామూహిక భవనం



సమస్య : పామిరెడ్డిపల్లెలో సామూహిక భవనం పిల్లర్స్‌కే పరిమితం అయింది. భవనం వెంటనే పూర్తి చేయాలి.

– వెంకటయ్య, పామిరెడ్డిపల్లె

జవాబు : పామిరెడ్డిపల్లెలో నిధుల కొరతతో భవనం నిలిచిందని నివేదికలు పంపించాం. సర్పంచి, ప్రజలు కోరటంతో ఎమ్మెల్యే భవనం పూర్తి చేయడానికి రూ.3 లక్షలు నిధులు కేటాయించారు. పనులను మూడు నెలల్లో పూర్తి చేయిస్తాం.

– భరత్‌కుమార్, పీఆర్ ఏఈ, అమరచింత

ప్రహరీ పూర్తి చేయండి

సమస్య : సాంఘిక సంక్షేమ వసతి గృహం ప్రహరీ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. .

– సంజయ్, అమరచింత

సమాధానం : ఎస్సీ ఉప ప్రణాళిక ద్వారా నిధులు నాలుగేళ్ల కిందట మంజూరయ్యాయి.. నిధుల ఆలస్యంగా విడుదల కావడంతో వెనక్కి వెళ్లి పనులు అసంపూర్తిగా మిగిలాయి..కొత్తగా నిధులు విడుదల చేయాలని నివేదిక పంపించాం.



– బెనర్జీ, వార్డెన్, అమరచింత

నిరుపయోగంగా శిక్షణ భవనం

సమస్య : అమరచింతలో చేనేత కార్మికులకు శిక్షణ ఇవ్వడానికి నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉంది. వినియోగంలోకి తీసుకొనిరావాలి.

– నరేష్, చేనేత కార్మికుడు, అమరచింత

జవాబు : చేనేత కార్మికులకు శిక్షణ ఇవ్వడానికి నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉన్నది వాస్తవమే. శిక్షణలు అక్కడే ఇవ్వాలని నివేదికలు పంపించాం.

– చంద్రమోహన్, చేనేత సహకార సంఘం ఛైర్మన్





ప్రమాదకరంగా నియంత్రిక

సమస్య : పామిరెడ్డిపల్లెలో విద్యుత్తు నియంత్రికలు ప్రమాదకరంగా ఉన్నాయి. రక్షణ కంచె ఏర్పాటు చేయాలి.

– మార్క సరోజ వెంకటయ్య, సర్పంచి, పామిరెడ్డిపల్లె

జవాబు : మండలంలో చాలా గ్రామాల్లో విద్యుత్తు నియంత్రికలకు కంచె ఏర్పాటు చేయలేదు. కంచె ఏర్పాటు చేయాలని నివేదికలు ఇచ్చారు. నిధులు మంజూరైతే పనులు పూర్తి చేయిస్తాం.

– రాజేందర్‌గౌడ్, ఏఈ, ఆత్మకూరు

సీపీఎస్ విధానం రద్దు చేసే వరకు ఆందోళనలు

ఊట్కూరు, న్యూస్‌టుడే : కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానం రద్దు చేసే వరకు ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం ఉద్యోగుల సంఘం(టీఎస్ సీపీఎస్ ఈయూ) మండలాధ్యక్ష, కార్యదర్శులు కోరం గోవర్ధన్, రాజేష్ ఖన్నా అన్నారు. వారు మంగళవారం సాయంత్రం తహశీల్దార్ కార్యాలయం వద్ద 7న గజ్వేల్‌లో నిర్వహించే ఆయుత ధర్మదీక్ష గోడపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. తహశీల్దార్ తిరుపతయ్య చేతుల మీదుగా గోడపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఎస్ విధానంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఆర్ఐ సతీష్ కుమార్‌రెడ్డి, డీటీ నాగన్న, కోశాధికారి బన్నేష్, సభ్యులు ఆనంద్, భీమయ్య, బాల్‌రాజ్, సుధాకర్ రెడ్డి, స్వరూప, అనిత, చంద్రకళ, శశిరేఖ, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

మంత్రోనిపల్లి రహదారిని బీటీగా మార్చాలి

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని గుడిగండ్ల, మంత్రోనిపల్లి రహదారిని బీటీగా మార్చాలని గ్రామస్థులు, ప్రయాణికులు కోరుతున్నారు. రహదారి మొత్తం గోతులమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు చొరవ తీసుకొని వెంటనే మంత్రోనిపల్లి, గుడిగండ్ల రహదారిని బీటీగా మార్చాలని కోరారు.



ఆత్మకూరు : సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తెరాస నేతలు

ఉచిత విద్యుత్తుపై సంబరాలు

నర్వ, న్యూస్‌టుడే : రైతులకు ఉచితంగా 24 గంటల పాటు కరెంటు సరఫరా చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి హర్షణీయమని తెరాస మండల నాయకులు చుక్క ఆశిరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, కిరణ్‌ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం నర్వ పశువుల సంత వద్ద అన్ని గ్రామాల రైతుల సమక్షంలో కేక్ కోసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల తెరాస యువజన సంఘం నాయకులు రాములుగౌడ్, విజయ్‌కుమార్, జనార్దన్‌రెడ్డి, జనార్ధన్, గోవిందు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఆత్మకూరు : రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తును అందిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయం ఆత్మకూర్ ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి తెరాస శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తెరాస మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. కేవలం మూడేళ్లలో రాష్ట్రం మిగులు విద్యుత్తును సాధించడం, అన్నదాతలకు కరెంటు కష్టాలను శాశ్వతంగా తొలగించడం తెరాస ప్రభుత్వానికే సాధ్యపడిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజేందర్‌సింగ్, విండో అధ్యక్షులు గాడి కృష్ణమూర్తి, వెంకటనర్సింహారావ్, అనిల్‌కుమార్‌గౌడ్, హాసీం, గోపాల్‌యాదవ్, రియాజ్, మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలకు మరమ్మతు చేపట్టాలి

పస్పుల(మక్తల్‌గ్రామీణం), న్యూస్‌టుడే : కొండదొడ్డి, ముస్లాయిపల్లి, పస్పుల గ్రామాల్లోని ఎత్తిపోతల పథకాలకు మరమ్మతు చేయాలని రైతులు కోరుతున్నారు. వందలాది ఎకరాలకు సాగునీరందించే ఎత్తిపోతలు పంప్‌ల మరమ్మతుకు నోచుకోక మూతపడ్డాయన్నారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకొని పంప్‌లు, కాల్వలకు మరమ్మతులు చేసి ఎత్తిపోతలు పునరుద్ధరించాలని కోరారు.

విద్యుత్తు సరఫరాలో ఆటంకం

చేగుంట(కృష్ణా), న్యూస్‌టుడే : కృష్ణా మండల పరిధిలోని చేగుంట ఫీడర్‌లో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం 24 గంటల విద్యుత్తు సరఫరా అని చెప్పడంతో ఆటోమేటిక్ స్టార్టర్‌లను తీసి వేశామని చేగుంట రైతులు తెలిపారు. కృష్ణా, భీమా నదుల సంగమ ప్రాంతానికి కృష్ణా సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అవుతుందని తెలిపారు. రెండు రోజులుగా రోజులో 10 నుంచి 15 సార్లు లైన్ ట్రిప్ కావడంతో నీళ్లు ముందుకు కదలడం లేదని వాపోయారు. భీమా నది పూర్తిగా వట్టిపోవడంతో కృష్ణా నదిలోని గుంతల నుంచి నీళ్లు మళ్లించుకోవడానికి మోటార్లు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్తు సరఫరా అంతరాయంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని రైతులు హన్మంతరాయ, సాయిబణ్ణ తెలిపారు. ఈ విషయంపై విద్యుత్తు సిబ్బంది మహేందర్ మాట్లాడుతూ.. తంగడిగిలో సాంకేతిక కారణాలతో ఇబ్బంది కలిగిందని లైన్‌లు సరి చేశామని తెలిపారు. ఇకపై సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని రైతులు సహకరించాలని కోరారు.

కార్మికుల సమస్యల సాధనకు ఉద్యమించాలి

ఊట్కూరు, న్యూస్‌టుడే : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కార్మికశాఖ అధికారులు, తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఇఫ్టూ జిల్లా నాయకులు కిరణ్ ఆరోపించారు. ఆయన మంగళవారం భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు పథకాల లబ్ధి కోసం దరఖాస్తు చేసుకుంటే, నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. దీంతో కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేదని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల సాధనకు వచ్చే నెలలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం మండలాధ్యక్షుడు చెన్నప్ప, నాయకులు జే.రాము, విజయభాస్కర్, కే.నాగేశ్, యామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరి



మాట్లాడుతున్న తహశీల్దార్

మక్తల్, న్యూస్‌టుడే : ప్రతి ఇంటికి మరుగుదొడ్డి తప్పనిసరిగా నిర్మించుకోవాలని తహశీల్దార్ ఓంప్రకాష్ అన్నారు. మంగళవారం మక్తల్‌లో సర్పంచి భాగ్యచంద్రకాంత్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఏపీఎం మాధవరెడ్డి మాట్లాడుతూ..మక్తల్ పట్టణంలో 1420 కుటుంబాలకు మరుగుదొడ్లు లేవని తమ సర్వే నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపించామన్నారు. ఈనెలాఖరులోపు మండల కేంద్రంలో వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తికావాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. వార్డు సభ్యులు తమ వార్డుల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో శంకర్‌నాయక్, వీఆర్‌వో రాజు, ఉపాధిహామీ సిబ్బంది క్రిష్ణ, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి



అంతర్జాల సౌకర్య సామగ్రి ఇస్తున్న ఎంఈవో జీహెచ్‌ఎంలు

నర్వ, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల మౌలిక వసతుల కల్పనకు కృషి చేద్దామని మండల విద్యాధికారి బాల్‌రాజు సూచించారు. మంగళవారం ఎమ్మార్సీలో పాఠశాల యాజమాన్య అభివృద్ధి కమిటీ సభ్యులకు నిర్వహించిన సమావేశానికి అన్ని పాఠశాలల నుంచి జీహెచ్‌ఎంలు, హెచ్‌ఎంలు, సీనియర్ ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులను ఆహ్వానించి ఒకరోజు శిక్షణ సమావేశాన్ని నిర్వహించారు. ఆర్ఎంఎస్ కింద ఉన్నత పాఠశాలలకు ఏటా మంజూరవుతున్న రూ.50 వేల నిధులను ప్రయోగశాల, పుస్తక లైబ్రరీ, మూత్రశాలలు, తాగునీరు, అదనపు తరగతి గదుల నిర్మాణాలను ఏర్పాటు చేయాలన్నారు. వీటితో బడిబయట ఉన్న విద్యార్థులను విధిగా పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అనంతరం స్మార్ట్ తరగతుల నిర్వహణ కోసం ఉన్నత పాఠశాలలకు ఉచితంగా అంతర్జాల సౌకర్య రూటర్లు, సిమ్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంలు ఆడమ్స్, విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడి, కస్తూర్బా ఎస్‌వో పావని, సీఆర్పీలు నర్సింహులు, రోజా పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలోనే పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలి : తెవివే

ఊట్కూరు, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ)కు హాజరవుతున్న ప్రతి అభ్యర్థికి ఉమ్మడి జిల్లాలోనే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని తెవివే జిల్లా సమన్వయకర్త బిజ్వార్ మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం సాయంత్రం విలేకర్లతో మాట్లాడుతూ ఎస్‌ఏ, ఎస్జీటీ అభ్యర్థులకు ఉమ్మడి జిల్లాలో కేంద్రాలు ఏర్పాటు చేసి, భాషా పండితులకు, వ్యాయామ ఉపాధ్యాయులకు హైదరాబాద్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం తగదన్నారు. సమావేశంలో మండలాధ్యక్షుడు ఖాజామైనోద్దీన్, టీఆర్టీ అభ్యర్థులు లక్ష్మణ్, మున్నా, తిమ్మప్ప, భానుచందర్, సిద్రాం పాల్గొన్నారు.

మేటీల వ్యవస్థ రద్దు చేసే జీవోను విరమించుకోవాలి

ఊట్కూరు, న్యూస్‌టుడే : ఉపాధి పథకంలో పని చేస్తున్న మేటీలను రద్దు చేసే జీవో నంబరు 240 రద్దు చేయాలని వ్యవసాయ రైతు కార్మిక సంఘం జిల్లా సమన్వయకర్త వెంకట్రామారెడ్డి డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం సాయంత్రం తహశీల్దార్ తిరుపతయ్యకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఉపాధి కూలీ రూ. 400 ఇవ్వాలని , ఏడాదిలో 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి సిబ్బందిని క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. మేటీల వ్యవస్థను రద్దు చేస్తే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బి.నారాయణ, అశోక్, శ్రీనివాస్, గోపాల్, నర్సింహులు పాల్గొన్నారు.

మక్తల్

తహసీల్దారు కార్యాలయం: 08503-283223
ఎంపీడీఓ: 283134 పోలీస్ స్టేషన్: 283133
పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం: 283183
అవినీతి నిరోధక శాఖ: 9440446143
భీమా ప్రాజెక్టు భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్: 284682
భీమా ప్రాజెక్టు ఈఈ: 284325
వ్యవసాయ మార్కెట్: 283143
కో-ఆపరేటివ్ బ్యాంక్: 283217
సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం: 283315
ప్రభుత్వ ఆసుపత్రి : 284175
విద్యుత్ ఏడీఈ: 283433

మక్తల్

ఎక్సైజ్ అధికారుల దాడులు

అమరచింత, న్యూస్‌టుడే : మండలంలోని కిష్టంపల్లిలో ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ ఖాజామైనోద్దీన్ ఆధ్వర్యంలో అనుమతి లేని కల్లు దుకాణంపై దాడులు నిర్వహించారు. దాడుల్లో 78 లీటర్ల కల్లును ధ్వంసం చేశారు. కల్లును పరీక్ష చేయగా సీహెచ్ కలిపినట్లు తేలిందన్నారు. దుకాణం నిర్వహిస్తున్న మహదేవ్‌గౌడ్‌పై కేసు నమోదు చేశామన్నారు. మంగళవారం మధ్యాహ్నం తహశీల్దార్ పాండునాయక్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ వెంకటస్వామి, షరీఫ్ పాల్గొన్నారు.



ఆత్మకూరు పట్టణాన్ని పురపాలికగా గుర్తించాలి

గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : మేజర్ పంచాయతీగా ఉన్న ఆత్మకూరు పట్టణాన్ని పురపాలికగా గుర్తించాలని కోరుతూ మంగళవారం గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. గతంలో నియోజకవర్గ కేంద్రంగా ఉన్న ఆత్మకూరు పట్టణం నియోజకవర్గ పరిధిలో విలీనం కావడంతో పాటు, కొత్తగా ఏర్పడిన వనపర్తి జిల్లా పరిధిలో చేర్చడంతో అన్ని రంగాల్లో తీవ్రంగా నష్టపోయిన పరిస్థితిని పరిగణలోకి తీసుకొని పట్టణాన్ని మున్సిపాలిటీగా అభివృద్ధి పర్చేందుకు ప్రభుత్వం బాధ్యత వహించాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సందర్భంగా సర్పంచి మొగిలి గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. పట్టణం నుంచి తరలించిన ఆయా ప్రభుత్వశాఖల కార్యాలయాలు తిరిగి పట్టణంలోనే ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులతో పట్టణంలోని అంతర్గత సీసీ రహదారులకు తీవ్ర నష్టం వాటిల్లిన క్రమంలో సంబంధిత అధికారులు సీసీ రహదారుల మరమ్మతులు చేపట్టాలని ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు వెంకటనర్సింహారావ్, లావణ్య పేర్కొన్నారు. పట్టణంలో ప్రధాన రహదారుల విస్తరణ ప్రక్రియ చేపట్టాలని గతంలోనే తీర్మానం సమర్పించిన పరిస్థితుల్లో ఆర్అండ్‌బీ శాఖ ఉన్నతాధికారులు రహదారుల విస్తరణ ప్రక్రియను ప్రారంభించాలని కోరుతున్నామన్నారు. గ్రామసభలో ఉప సర్పంచి లావణ్య, కార్యదర్శి హుసేనప్ప, వార్డు సభ్యులు, ఆయా ప్రభుత్వశాఖల సిబ్బంది పాల్గొన్నారు.


ఆత్మకూర్ గ్రామసభకు హాజరైన ఎంపీపీ, సర్పంచి, సభ్యులు

ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యవర్గం

ఊట్కూరు, న్యూస్‌టుడే : ఊట్కూరు మండల కేంద్రంలో నిర్వహించిన ప్రగతి శీల భవన నిర్మాణ కార్మిక సంఘం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండలాధ్యక్షుడు చెన్నప్ప తెలిపారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా నాయకుడు కిరణ్ ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు. గ్రామాధ్యక్షుడిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్, ఆశప్ప, నింగప్ప, ప్రధాన కార్యదర్శిగా ఎం.చంద్రప్ప, సహాయ కార్యదర్శులుగా మల్లికార్జున్, ఎండీ ముక్రం, కిట్టు, కోశాధికారిగా ఎం.లక్ష్మారెడ్డి, 8 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు విజయభాస్కర్, జౌలాపూరం రాము, ఎండీ తాజ్, యామారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల గడువు

నర్వ, న్యూస్‌టుడే : కన్మనూరు గ్రామ ఎంపీటీసీ ఉప ఎన్నిక ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. కాంగ్రెస్, తెరాసలతో పాటు స్వతంత్రంగా అభ్యర్థులు నామినేషన్లను అధికారులకు అందజేశారు. ఎంపీటీసీ స్థానం ఎస్టీకి కేటాయించడంతో కన్మనూరు, గాజులయతండా చెందిన మొత్తం నలుగురు అభ్యర్థులు వేర్వేరుగా నామినేషన్లను అందజేశారు. స్వీకరించిన నామినేషన్లకు బుధవారం స్క్రూట్నీ చేపట్టేందుకు ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. 6న నామినేషన్ల ఉపసంహరణ గడువు విధించడంతో సాయంత్రం తర్వాత పోటీదారులను ప్రకటిస్తామని ఎన్నికల అధికారి తిరుమల్‌రావు తెలిపారు.

సేవలతోనే గుర్తింపు

మక్తల్, న్యూస్‌టుడే : ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని పదవీ కాలంలో చేసిన సేవలే గుర్తింపు తెస్తాయని మక్తల్ పీఆర్ డిప్యూటీ ఈఈ రాంమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భగవాన్‌గౌడ్ పదవీ విరమణ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. అనంతరం డిప్యూటీ ఈఈ రాంమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భగవాన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ నర్సింగరావు, డిప్యూటీ ఈఈలు శ్రీహరి, నరేందర్, ఎంపీపీ సునీతాగోపాల్‌రెడ్డి, మార్కెట్ ఛైర్మన్ నర్సింహగౌడ్, భాజపా నేత కొండయ్య, చంద్రకాంత్‌గౌడ్, పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరణ

మక్తల్, న్యూస్‌టుడే : నాగార్జునసాగర్‌లో 6,7 తేదీల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే తెలుగు రాష్ట్రాల రాజకీయ శిక్షణ తరగతుల గోడపత్రికను ఎమ్మార్పీఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి జె. శ్రీనివాస్ మాదిగ మంగళవారం స్థానిక ఐబీ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ తరగతులతో ప్రజాకవి గద్దర్, సంపాదకులు అల్లం నారాయణ తదితరులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు క్రిష్ణ, వెంకటేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

మక్తల్, న్యూస్‌టుడే : భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ భవనానికి మక్తల్ పట్టణంలో స్థలం కేటాయించాలని కోరుతూ ఆ సంఘం నాయకులు అనిల్‌కుమార్, సాయిలు మేస్త్రీ మంగళవారం తహశీల్దార్ ఓంప్రకాష్, సర్పంచి భాగ్యచంద్రకాంత్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు వెంకటేష్, గోవర్ధన్, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

అమరచింత : గ్రామాభివృద్ధికి ప్రజలు పన్నులు చెల్లించి సహకరించాలని కార్యదర్శి కె.కృష్ణయ్య పేర్కొన్నారు. మంగళవారం అమరచింత మండలం కొంకలవానిపల్లె పంచాయతీ కార్యాలయంలో సర్పంచి మాసన్న అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య పనుల్లో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. మిషన్ భగీరథ పథకం కింద వదిలేసిన పైపులైన్ పనులు పూర్తి చేయించాలన్నారు.. సమావేశంలో గ్రామ వార్డు సభ్యులు , క్షేత్ర సహాయకులు, హెచ్ఎం లింగన్న, అంగన్వాడీ, ఆశ, సాక్షరభారత్, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా నీలగిరి స్వామి జయంతి

మక్తల్, న్యూస్‌టుడే : కర్ణాటక రాష్ట్రం రాయచూరు నీలగిరి శాలీమఠం అధిపతి మారయ్య స్వామి 150వ జయంతి వేడుకలను మంగళవారం నల్ల జానమ్మ ఆలయ ఆవరణలో మక్తల్ మఠం శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నీలగిరి మఠాధిపతి సూరయ్య స్వామిని పడమటి ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా నల్లజానమ్మ స్వామి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మారయ్యస్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మక్తల్ శాఖ ప్రతినిధులు రవికుమార్‌యాదవ్, లక్ష్మీనారాయణ, రామన్ గౌడ్, కాంతికుమార్, మదన్, ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుగురయ్యస్వామి

సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాన్ని చేరుకోవాలని మంగళవారం మండల పరిధిలోని ఆరేపల్లిలో నిర్వహించిన గ్రామసభలో గ్రామస్థులు తీర్మానించారు. సర్పంచి ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో కార్యదర్శి నరేష్ మరుగుదొడ్ల నిర్మాణ పనులను పూర్తి చేసే లక్ష్యంపై తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. గ్రామంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇంటి, నల్లా పన్నుల వసూళ్లను వందశాతం చేసేందుకు గ్రామస్థులు పూర్తి స్థాయిలో సహకరించాలని ఈ సందర్భంగా సర్పంచి ఆంజనేయులు కోరారు. పారిశుద్ధ్య పరిరక్షణలో ప్రజలు సైతం భాగస్వామ్యం అందించి, స్వచ్ఛభారత్ కార్యక్రమాలను జయప్రదం చేయాల్సిందిగా కోరుతున్నామన్నారు. గ్రామసభలో ఎంపీటీసీ సభ్యులు దేవరాజు, మాజీ సర్పంచీలు కోటేష్, గ్రామ పెద్దలు లక్ష్మన్, దేవేందర్, బాలయ్య, తిరుపతయ్య, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఆరేపల్లి గ్రామసభకు హాజరైన ప్రజలు

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజ

జక్లేర్(మక్తల్‌గ్రామీణం), న్యూస్‌టుడే : మండలంలోని జక్లేర్ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అయ్యప్పదీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ మహాపూజకు వందల మంది స్వాములు పాల్గొన్నారు. కలశం ఊరేగింపు, జ్యోతిర్లింగపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములకు బిక్ష(అన్నదానం) కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి, బాజపా నాయకులు కొండయ్య, మార్కెట్ చెర్మేన్ నర్సింహ్మగౌడ్, రాజుల ఆశిరెడ్డి, గురుస్వాములు ఊట్కూర్, మాగనూరు, ధన్వాడ, నర్వ మండలాల అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

నేడు మహాపడిపూజ

అమరచింత : అమరచింత మండల కేంద్రం హరిహార క్షేత్రంలో బుధవారం అయ్యప్పస్వామి మహాపడి పూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు గురుస్వాములు మాకం నర్సింహులు, లచ్చన్నగౌడ్, భాస్కర్, తిర్మలేష్, కమలాకర్ గౌడ్, శ్రీను ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పూజకు ధన, వస్తు రూపంలో సహకరించాలని కోరారు.

శబరియాత్రకు దీక్షాపరులు

ఆత్మకూరు : ఆత్మకూరు పట్టణానికి చెందిన అయ్యప్పస్వామి దీక్షాపరులు మంగళవారం సాయంత్రం మూకుమ్మడిగా శబరిమళ యాత్రకు బయలుదేరి వెళ్లారు. స్థానిక బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో ఇరుముడులను కట్టుకున్న 40 మంది దీక్షాపరులు వేర్వేరు వాహనాల్లో ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు గాడి లక్ష్మినారాయణ దీక్షాపరులుకు తనవంతుగా ఆర్థిక సహాయం చేశారు. మధ్యాహ్నం దీక్షాపరులతో పాటు వారి కుటుంబ సభ్యులు, బందువులకు ఇరుముడి భిక్షను బంగారు శ్రీనివాసులు ఏర్పాటు చేయించారు. పట్టణ ప్రముఖులు రామలక్ష్మారెడ్డి, రమేష్, రవికుమార్‌యాదవ్, తెదేపా మండల అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు అశ్వీన్‌కుమార్, వెంకటనర్సింహారావ్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

శివదీక్షలు ప్రారంభం

మక్తల్, న్యూస్‌టుడే : మక్తల్ మల్లికార్జునస్వామి ఆలయ అర్చకులు వేద పం డిత రుద్రాక్ష కిరీట ధారిణి తిప్పయ్యస్వామి ఆధ్వర్యంలో మంగళవారం పలు గ్రామాల భక్తులు మాలధారణ చేసి శివదీక్షలు తీసుకున్నారు. తిప్పయ్యస్వామి గురు ఉపదేశం చేస్తూ శివస్వాములు 40 రోజుల పాటు నిష్టతో దీక్షలు పూర్తి చేయాలని శివనామ జపం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలు గ్రామాల శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

మక్తల్, న్యూస్‌టుడే : డిసెంబర్ 30, 31 తేదీల్లో షాద్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కెరళాస్కూళ్ల క్రీడా పోటీల్లో ప్రతిభ చాటి హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి చేతులమీదుగా పాఠశాల విద్యార్థులు బహుమతులు అందుకున్నారని స్థానిక టెక్నో స్కూల్ కరస్పాండెంట్ మీరా రాబిన్ అన్నారు. మంగళవారం ఆమె బహుమతులు అందుకున్న విద్యార్థులను అభినందించి మాట్లాడారు. సబ్ జూనియర్ పరుగు పందెంలో బాలికల విభాగంలో ధనుశ్రీ, బాలుర విభాగంలో శివశంకర్ ప్రథమ బహుమతి అందుకున్నారన్నారు. షాట్‌పుట్‌లో గాయత్రి, ఆంజనేయులు, ద్వితీయ బహుమతి సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో లోపించిన పారిశుద్ధ్యం

చిట్యాల(మక్తల్‌గ్రామీణం), న్యూస్‌టుడే : కర్ని, సామన్‌పల్లి, పస్పుల, జక్లేర్, గుడిగండ్ల, పస్పుల, చిట్యాల, బొందల్‌కుంట గ్రామాల్లో సరైన కాల్వల వ్యవస్థ లేకపోవడంతో పారిశుద్ధ్యం లోపించింది. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు అన్ని గ్రామాల్లో మురుగు కాల్వలు నిర్మించి పారిశుద్ధ్య క్యాక్రమాలు చేపట్టాలని కోరుతున్నారు.

రహదారుల మరమ్మతు పనులు ప్రారంభం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు పట్టణంలోని ప్రధాన రహదారుల మరమ్మతు పనులు ఎట్టకేలకు మంగళవారం ప్రారంభమయ్యాయి. గాంధీచౌక్‌తో పాటు ఇతర ప్రధాన రహదారులపై తారు కొట్టుకుపోవడం, పైప్‌లైన్‌లకు లీకేజీలు కొనసాగుతుండడంతో మూడేళ్లుగా ప్రధాన రహదారులు గతుకులమయంగా మారాయి. ఈ క్రమంలో ఆర్అండ్‌బీ శాఖ కృష్ణా పుష్కరాల సందర్భంగా కేటాయించిన మిగులు నిధులతో రహదారుల మరమ్మతు పనులను చేపట్టింది. ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతును సరి చేశారు. వారం రోజుల లోపు వైట్‌మిక్స్‌పై తిరిగి తారు వేసే పనులను పూర్తి చేయించనున్నామని ఏఈ దథథానయ్య పేర్కొన్నారు.

అసంపూర్తి పనులతో అవస్థ

కొండదొడ్డి(మక్తల్‌గ్రామీణం), న్యూస్‌టుడే : మండలంలోని కొండదొడ్డి ప్రాథమిక పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి పనులు పూర్తి కాక అసంపూర్తి దశలో నిలిచిపోయి నిరుపయోగంగా మారింది. మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టిన గుత్తేదారు బిల్లులు చెల్లించడం లేదనే కారణంతో అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. అధికారులు చొరవ తీసుకొని పాఠశాల వద్ద అసంపూర్తిగా నిర్మించిన మరుగుదొడ్డి నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

వనపర్తి

తెరపై ఈనాడు



శ్రీరామ : హలో
శ్రీనివాస : ఎంసీఏ
శ్రీ వేంకటేశ్వర : ఒక్కక్షణం
శ్రీరంగ : 2 కంట్రీస్

- న్యూస్‌టుడే వనపర్తి పట్టణం

బాధిత కుటుంబానికి పరామర్శ

అప్పాయిపల్లి(వనపర్తి గ్రామీణం), న్యూస్‌టుడే : మండలంలోని అప్పాయిపల్లికి చెందిన కిష్టన్న(70) మంగళవారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను జడ్పీటీసీసభ్యుడు వెంకటయ్యయాదవ్, సర్పంచి విష్ణు, డీసీసీబీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, మాజీ సర్పంచి రామారావు పరామర్శించారు.

దాడులు చేయడం సరికాదు

పెబ్బేరు, న్యూస్‌టుడే : రెండ్రోజుల కిందట దాడిలో తీవ్రంగా గాయపడి హైదరాబాదు కిమ్స్ ఆసుపత్రిలో



హైదరాబాదులో శివశంకర్‌గౌడును పరామర్శిస్తున్న నిరంజన్‌రెడ్డి

చికిత్స పొందుతున్న పెబ్బేరు ఎంపీటీసీసభ్యుడు శివశంకర్‌గౌడును మంగళవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నిరంజన్‌రెడ్డి తెలిపారు. పరామర్శించిన వారిలో తెరాస మండల పార్టీ అధ్యక్షుడు హరిశంకర్‌నాయుడు, చెలిమిల్ల సర్పంచి రామన్‌గౌడు, తెరాస నాయకులు అరుణ్‌యాదవ్, రమేశ్ నాయుడు ఉన్నారు.

మంచినీటికి గిరిజనుల ఇబ్బందులు

కాలిపోయిన నియంత్రిక

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : మంచినీటి కోసం కేశంపేట కొత్తతండాకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజుల కిందట తండాలోని విద్యుత్తు నియంత్రిక కాలిపోయింది. దానికి మరమ్మతులు చేయించేవారు లేకపోవడంతో తండాలోని మంచినీటి బోర్లు పనిచేయలేదు. ఇళ్లల్లో విద్యుద్దీపాలు వెలగలేదని, చూసీచూసి విసిగిపోయామని తండావాసులు తెలిపారు. విద్యుత్తు అధికారులు, సిబ్బందికి సమాచారం అందించామని వారు వాపోతున్నారు. రోజూ చిన్నాపెద్దా, మహిళలు, పెద్దలు వ్యవసాయ బోర్లవద్దకు వెళ్లి మంచినీటిని తెచ్చుకుంటున్నామన్నారు. తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటే అధికారులు మాత్రం స్పందించడం లేదని తండావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేసేదిలేక తండావాసులు విరాళాలు సేకరించి మంగళవారం నియంత్రికకు మరమ్మతులు చేయించాలని నిర్ణయించారు. సొంత ఖర్చులతో ట్రాక్టర్‌పై వనపర్తికి తరలించి మరమ్మతులు చేయించారు. తండాకు తీసుకొచ్చి దిమ్మెపై ఉంచి ఆన్ చేశారు. అయినా పనిచేయలేదు. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్తు సిబ్బంది స్పందించి నియంత్రికకు మరమ్మతులు చేయించి తండాలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని తండావాసులు కోరుతున్నారు.



నీటికోసం వ్యవసాయ బోర్ల వద్ద ప్రజలు

లక్ష్యానికి చేరువలో మరో రెండు గ్రామాలు



మరుగదొడ్ల ప్రగతిపై సర్పంచితో ఆరా తీస్తున్న ఎంపీడీవో

రాంపురం(పెబ్బేరు) : వంద శాతం మరుగుదొడ్లు నిర్మించుకున్న గ్రామాల జాబితాలో పెబ్బేరు మండలంలో మరో రెండు ఊర్లు చేరుతున్నాయి. మండలంలోని జనంపల్లి ఇప్పటికే వంద శాతం మరుగుదొడ్లు నిర్మించుకున్న గ్రామంగా పేరు తెచ్చుకుంది. దీంతోపాటు రాంపురం, బుడిదిపాడూ వంద శాతానికి చేరువలో ఉన్నాయి. మరో వారం, పది రోజుల్లో నిర్మాణంలో ఉన్నవి పూర్తవుతాయని ఉపాధి పథకం ఏపీవో బాలయ్య తెలిపారు. రాంపురంలో 243 మరుగుదొడ్లకుగాను 238 పూర్తయ్యాయని, మరో 5 ప్రగతిలో ఉన్నాయని తెలిపారు. అలాగే బుడిదిపాడులో 355కుగాను 335 పూర్తయ్యాయన్నారు. త్వరలో మిగిలిన 20 పూర్తి చేయిస్తామని ఆయన తెలిపారు. మిగిలిన గ్రామాల్లోనూ వంద శాతం మరుగుదొడ్లు నిర్మించుకునేలా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు బాలయ్య తెలిపారు.

విద్యార్థి ప్రతిభకు ప్రశంసలు

మానాజీపేట(ఖిల్లాగణపురం) : మండలంలోని మానాజీపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని వ్యాసరచన పోటీలో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో గ్రామ ప్రముఖుల



విద్యార్థినితో జీహెచ్ఎం

నుంచి ప్రశంసలు అందుకుంది. శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో ఎం.నాగలక్ష్మి 5వ ర్యాంకు సాధించినందుకుగాను ఆమెను మంగళవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రంగయ్య, విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కమ్మరి గోపి, ధ్యానకర్త దీర్ఘాయువు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

నాయీబ్రాహ్మణ యూత్ ఆధ్వర్యంలో సన్మానం

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాసులను భాజపా ఓబీసీ



శ్రీనువాసులును సన్మానిస్తున్న నాయీబ్రాహ్మణ యూత్ కమిటీసభ్యులు

మండల అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణ యువజన సంఘం ఆధ్వర్యంలో వనపర్తిలో రాంనగర్‌కాలనీలో సమావేశం ఏర్పాటు చేసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం యూత్ అధ్యక్షుడు ఎ.చంద్రకుమార్, నాయకులు మహాలంక రాజు, వనపర్తి పట్టణ అధ్యక్షుడు ఎ.రమేష్, మోహన్, నాగరాజు, తిరుమలేష్, మహేష్, పవన్, కుమార్, శేఖర్, చక్రపాణి, రఘు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు రంగోలి పోటీలు

వనపర్తి, న్యూస్‌టుడే : సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని బుధవారం ఎంఎస్ చంద్రయ్య విద్యాసంస్థ ప్రాంగణంలో అంతర కళాశాలల విద్యార్థులకు చర్చాగోష్ఠి, ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి ఎంఎస్ నగేష్‌చంద్ర, కోశాధికారి పి.ఉష తెలిపారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ శ్వేతా మహంతి, పాలమూరు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రారు వెంకటాచలం, రిజిస్ట్రారు పాండురంగారెడ్డి, పరీక్షల అధికారి గిరిజా మంగతాయారు, ఉపకులపతి మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సింహయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీంద్రరావు హాజరు కానున్నారని తెలిపారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన ముగ్గురికి బహుమతులను అందిస్తామని తెలిపారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు డి.శరత్‌చంద్ర, సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

బండరావిపాకులలో గ్రామజ్యోతి శిక్షణ

బండరావిపాకుల(రేవల్లి), న్యూస్‌టుడే : మండలంలోని బండరావిపాకులలో మంగళవారం గ్రామజ్యోతి శిక్షణ కార్యక్రమం సర్పంచి రమాదేవి ఆధ్వర్యంలో జరిగింది. గ్రామంలో మహిళలకు ప్రాధాన్యం, ఆరోగ్యం, నగదు బదిలీ, బాల్యవివాహాలు, స్వచ్ఛభారత్ మిషన్, ప్లాస్టిక్ వాడకం నిషేధం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీవోటీలు ఎల్లయ్య, రవి, పంచాయతీ కార్యదర్శి హన్మంతు, ఏఎన్ఎం బొజ్జమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పెబ్బేరు మార్కెట్‌కు ఇతర రాష్ట్రాల వ్యాపారులు



మార్కెట్లో వేరుసెనగను పరిశీలిస్తున్న దృశ్యం

పెబ్బేరు, న్యూస్‌టుడే : దినదినాభివృద్ధి చెందుతున్న పెబ్బేరు వ్యవసాయ మార్కెట్‌కు స్థానికులే కాకుండా ఇతర రాష్ట్రాల వ్యాపారులూ తరలి వస్తున్నారు. ప్రస్తుతం వేరుసెనగ సీజన్ కావడంతో మార్కెట్ రాశులతో నిండిపోయింది. ఇక్కడ నాణ్యమైన వేరుసెనగ లభిస్తుందని తెలుసుకొన్న మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు మార్కెట్ ఛైర్మన్ బుచ్చారెడ్డితో కలిసి మంగళవారం మార్కెట్‌ను పరిశీలించారు. ప్రస్తుతం వేరుసెనగ క్వింటా రూ.4,635 పలుకుతోంది. ఇతర రాష్ట్ర వ్యాపారులు రావడంతో ధరలు పెరుగుతాయని రైతులు ఆశిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు రావడం శుభపరిణామమని ఛైర్మన్ బుచ్చారెడ్డి అన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ మండలం బోయపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీఎస్ఎఫ్ వనపర్తి-గద్వాల జిల్లాల ఇన్‌ఛార్జి డేవిడ్ అన్నారు. వనపర్తిలో సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోయపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని కావాలనే ధ్వంసం చేశారన్నారు. సంఘం నాయకులు మహేశ్, నాగరాజు, కేశన్న, గంగన్న పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మెంటెపల్లి(వనపర్తి గ్రామీణం), న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి పురుషోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మెంటెపల్లిలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించుకోవాలన్నారు. ప్రధాన కూడళ్లలో చెత్తకుండీలను ఏర్పాటు చేశామని తెలిపారు. చెత్తను కుండిల్లో, కాలనీకి వచ్చే చెత్తరిక్షాలో వేయాలన్నారు. గ్రామంలో చేపట్టిన పనులు, ఖర్చుల వివరాలను వివరించారు. సమావేశంలో ఉపసర్పంచి రాజు, ఎంపీటీసీసభ్యురాలు మణెమ్మ, పలువురు వార్డుసభ్యులు, గ్రామ కార్యదర్శి రాజు పాల్గొన్నారు. మండలంలోని అప్పాయిపల్లి, అంకూరులో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. అప్పాయిపల్లి గ్రామసభలో సర్పంచి విష్ణు, జడ్పీటీసీసభ్యుడు వెంకటయ్యయాదవ్, డీసీసీబీ ఉపాధ్యక్షుడు శంకరరావు, గ్రామ కార్యదర్శి యాదమ్మ పాల్గొన్నారు.

ఆటో స్టార్టర్ల తొలగింపు

మెంటెపల్లి(వనపర్తి గ్రామీణం) : రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి నిరంతరం విద్యుత్తు అందించడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి అన్నారు. గతంలో సింగిల్‌ఫేజ్, 9 గం.లపాటు విద్యుత్తు సరఫరా చేయడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు బోరుమోటార్లకు ఆటోమేటిక్ స్టార్టర్లను ఏర్పాటు చేసుకొని నీటిని వ్యవసాయానికి వాడుకునేవారని, వాటితో నీరు వృథా అవుతోందన్నారు. రైతు బాంధవుడైన ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నదాతల కష్టాలను తీర్చేందుకు నిరంతర విద్యుత్తును సరఫరా చేస్తోందన్నారు. రాష్ట్రంలో బంగారు తెలంగాణకు ఇదొక్కటే నిదర్శనమన్నారు. రైతులతో మాట్లాడి వ్యవసాయ బోరు మెటార్లకున్న స్టార్టర్లను తొలగించారు. తొలగించిన వాటిని పంచాయతీకి అప్పగించారు. ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, విద్యుత్తుశాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచి రాజు, ఎంపీటీసీసభ్యురాలు మనెమ్మ, మాజీ సర్పంచి భారయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.



ఆటోస్టార్టర్లను తొలగిస్తున్న సర్పంచి పురుషోత్తంరెడ్డి, రైతులు

వనపర్తి టౌన్

పోలీస్ స్టేషన్ : 232333 (100)	ఫైర్ స్టేషన్: 101 అంబులెన్స్: 108	విద్యుత్ ఎంక్వైరీ: 232104	గ్యాస్ ఏజెన్సీ: 232235	ఎండీఓ కార్యాలయం: 232043	మహిళల వేధింపుల ఫిర్యాదు: 1091
ప్రభుత్వ ఆసుపత్రి: 232113	అవినీతి నిరోధక శాఖ: 9440446143	నీటి పంపిణీ: 232044	తహశీల్దార్ కార్యాలయం: 232046	అవినీతి నిరోధక శాఖ: 9440446143	

వనపర్తి

ఎక్సైజ్ అధికారుల దాడులు

అమరచింత : మండలంలోని కిష్టంపల్లిలో ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ ఖాజామైనోద్దిన్ ఆధ్వర్యంలో అనుమతి లేని కల్లు దుకాణంపై దాడులు నిర్వహించారు. దాడుల్లో 78 లీటర్ల కల్లును ధ్వంసం చేశారు. కల్లును పరీక్ష చేయగా సీహెచ్ కలిపినట్లు తెలిందన్నారు. దుకాణం నిర్వహిస్తున్న మహదేవ్‌గౌడ్‌పై కేసు నమోదు చేశామన్నారు. మంగళవారం తహశీల్దార్ పాండునాయక్ ఎదుట హాజరుపరిచామన్నారు.



తీరని తిప్పలు
ఆసుపత్రిలో బారులు


అత్యవసర విభాగం వద్ద బారులుతీరిన రోగులు

న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

జిల్లా కేంద్ర ఆసుపత్రిలో రోగులు చికిత్స కోసం గంటల తరబడి నిరీక్షించక తప్పడం లేదు. రోజూ 500 దాకా వచ్చే ఔట్‌పేషంట్లు వరుసలో నిలబడి ఇబ్బందులు పడుతున్నారు. చంటిపిల్లలతో వచ్చిన వారు, వృద్ధులు, దివ్యాంగులు గంటల తరబడి వరుసల్లో నిల్చోలేక బేజారెత్తిపోతున్నారు.

ఇదీ పరిస్థితి.. : జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో బయటి నుంచి వచ్చి చికిత్స చేయించుకునే వారి కోసం రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒకటి ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద, మరోటి అత్యవసర విభాగం వద్ద ఏర్పాటు చేశారు. మొదటిది 12 గం.ల వరకు పనిచేస్తే, తరవాత వచ్చిన రోగులు రెండో కేంద్రం వద్ద రిజిస్ట్రేషను చేయించుకుంటారు. రెండ్రోజులుగా మొదటి కేంద్రం ఉదయం నిర్దేశిత సమయానికి మూసేయడంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు రెండో కేంద్రం వద్ద పడిగాపులు కాశారు. దాదాపు గంటకుపైగా వరుసలో నిలబడినా కేంద్రం వద్ద ఎవరూ లేకపోవడంతో చీటీలు రాయించుకోలేక, సకాలంలో చికిత్సలు చేయించుకోలేకపోయామని రోగులు చెబుతున్నారు. అలాగే చిన్నపిల్లల విభాగం వద్దా రోగులు చంటిపిల్లలను తీసుకొని వరుసలో నిలబడ్డారు. ఒక్కరే వైద్యురాలు ఉండడంతో పిల్లలను చూయించడానికి ఎక్కువ సమయం పడుతోందని, మరో వైద్యుణ్ని ఏర్పాటు చేస్తే కొంత ఉపశమనం కలగవచ్చని రోగులు తెలిపారు.


చిన్నపిల్లల విభాగం వద్ద ఇలా..



సిబ్బంది కొరతతోనే జాప్యం.. : ఆసుపత్రిలో వైద్యులు, ఇతర సిబ్బంది కొరత పట్టిపీడిస్తోంది. ఒక్కోసారి ఔట్‌పేషంట్లు 500- 700 దాకా వస్తున్నారు. ఆ సమయంలో ఉన్న వైద్యులే చికిత్సలు అందించడంలో కొంత జాప్యం జరిగే అవకాశం ఉంది. సెలవు రోజుల్లో వైద్యులు తక్కువగా హాజరవుతారు. ఈ సమస్యను అధిగమిస్తాం.

- శ్రీనివాసరెడ్డి, ఆర్ఎంవో

రెండు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

పెబ్బేరు, న్యూస్‌టుడే : పెబ్బేరు సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. రాంపురం రోడ్డ వద్ద రామకృష్ణాపురం వెళుతున్న శ్రీనివాసులు అనే వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొనగా శ్రీనివాసులు కాలు, చెయ్యి విరిగింది. మంగళవారం సాయంత్రం పెబ్బేరు బైపాస్ రోడ్డు వద్ద ద్విచక్రవాహనంపై వెళుతున్న కర్నూల్‌కు చెందిన మునీర్, ఇబ్రహీం బస్సును ఢీకొనగా వీరికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వారిని 108లో పెబ్బేరు ఆసుపత్రికి తరలించి చికిత్స చేశారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు

గ్రామాభివృద్ధికి సహకరించాలి

అమరచింత : గ్రామాభివృద్ధికి ప్రజలు పన్నులు చెల్లించి సహకరించాలని కార్యదర్శి కె.కృష్ణయ్య పేర్కొన్నారు. మంగళవారం అమరచింత మండలం కొంకలవానిపల్లె పంచాయతీ కార్యాలయంలో సర్పంచి మాసన్న అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య పనుల్లో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. మిషన్ భగీరథ పథకం కింద వదిలేసిన పైపులైన్ పనులు పూర్తి చేయించాలన్నారు.. సమావేశంలో గ్రామ వార్డు సభ్యులు , క్షేత్ర సహాయకులు, హెచ్ఎం లింగన్న, అంగన్‌వాడీ, ఆశ, సాక్షరభారత్, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులు ప్రారంభం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు పట్టణంలోని ప్రధాన రహదారుల మరమ్మతు పనులు ఎట్టకేలకు మంగళవారం ప్రారంభమయ్యాయి. గాంధీచౌక్‌తో పాటు ఇతర ప్రధాన రహదారులపై తారు కొట్టుకుపోవడం, పైప్‌లైన్‌లకు లీకేజీలు కొనసాగుతుండడంతో మూడేళ్లుగా ప్రధాన రహదారులు గతుకులమయంగా మారాయి. ఈ క్రమంలో ఆర్అండ్‌బీ శాఖ కృష్ణా పుష్కరాల సందర్భంగా కేటాయించిన మిగులు నిధులతో రహదారుల మరమ్మతు పనులను చేపట్టింది. ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతును సరి చేశారు. వారం రోజుల లోపు వైట్‌మిక్స్‌పై తిరిగి తారు వేసే పనులను పూర్తి చేయించనున్నామని ఏఈ దథథానయ్య పేర్కొన్నారు.

చౌడేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : మంగళవారం పౌర్ణమిని పురస్కరించుకొని వనపర్తి జిల్లా కేంద్రంలోని చౌడేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చౌడేశ్వరీ మాతను అలంకరించారు. అభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. అక్కడికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు మదన్‌మోహన్, పవన్, శేఖర్, శ్రీను, బిచ్చన్న, వెంకటేశ్, శంకర్, సుజాత, సరళ, పావని, శకుంతల పలువురు మహిళలు పాల్గొన్నారు.


చౌడేశ్వరీ ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

తపస్ కాలమానిని ఆవిష్కరణ

పెద్దమందడి, న్యూస్‌టుడే : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో మండల వనరుల భవనంలో మంగళవారం తపస్ కాలమానిని ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల హక్కులతోపాటు బాధ్యతలను గుర్తెరిగి పనిచేస్తున్న సంఘమన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు వరప్రసాద్‌గౌడ్, ఎంపీడీవో కార్యాలయ సీనియరు సహాయకుడు భానుప్రసాద్, బాలుర ఉన్నత పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ సేనాపతి, తపస్ మండల అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి మనోహర్, జిల్లా కార్యదర్శి మమత, మండల ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య, రాములు, నాగయ్య, గిరిరాజయ్య, ప్రసన్నలక్ష్మి, ఖాదర్‌బాషా, రాణి, వాణి, జమీల్, మునావర్ తదితరులు పాల్గొన్నారు.


తపస్ కాలమానిని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం


చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

శ్రీరంగాపురం : ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా రైతులకు 24 గం.ల విద్యుత్తు సరఫరా చేయడం చరిత్రాత్మకమని తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆయనకు రుణపడి ఉన్నారని పెబ్బేరు మార్కెట్ డైరెక్టర్ పర్వతాలు, తెరాస నాయకులు పృథ్వరాజు, జలీల్ తెలిపారు. రైతులకు వ్యవసాయానికి 24 గం.ల విద్యుత్తు సరఫరా చేస్తున్నందుకు మంగళవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతులకు 24 గం.లు ఉచిత విద్యుత్తు ఇవ్వడం ముఖ్యమంత్రికి రైతులపై ఉన్న అభిమానికికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో తెరాస నాయకులు ఆంజనేయులు, శ్రీనివాసులు, సుధాకర్, బీసన్న, బాల్‌చంద్రయ్య, నాగరాజు, కృష్ణయ్య, కురుమన్న, వెంకటేశ్ పాల్గొన్నారు.

శబరియాత్రకు దీక్షాపరులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు పట్టణానికి చెందిన అయ్యప్పస్వామి దీక్షాపరులు మంగళవారం సాయంత్రం మూకుమ్మడిగా శబరిమళ యాత్రకు బయలుదేరి వెళ్లారు. స్థానిక బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో ఇరుముడులను కట్టుకున్న 40 మంది దీక్షాపరులు వేర్వేరు వాహనాల్లో ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు గాడి లక్ష్మినారాయణ దీక్షాపరులుకు తనవంతుగా ఆర్థిక సహాయం చేశారు. మధ్యాహ్నం దీక్షాపరులతో పాటు వారి కుటుంబ సభ్యులు, బంధువులకు ఇరుముడి భిక్షను బంగారు శ్రీనివాసులు ఏర్పాటు చేయించారు. పట్టణ ప్రముఖులు రామలక్ష్మారెడ్డి, రమేష్, రవికుమార్‌యాదవ్, తెదేపా మండల అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు అశ్వీన్‌కుమార్, వెంకటనర్సింహారావ్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

మరుగుదొడ్ల లక్ష్యాన్ని చేరుకోవాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాన్ని చేరుకోవాలని మంగళవారం మండల పరిధిలోని ఆరేపల్లిలో నిర్వహించిన గ్రామసభలో గ్రామస్థులు తీర్మానించారు. సర్పంచి ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో కార్యదర్శి నరేష్ మరుగుదొడ్ల నిర్మాణ పనులను పూర్తి చేసే లక్ష్యంపై తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. గ్రామంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇంటి, నల్లా పన్నుల వసూళ్లను వందశాతం చేసేందుకు గ్రామస్థులు పూర్తి స్థాయిలో సహకరించాలని ఈ సందర్భంగా సర్పంచి ఆంజనేయులు కోరారు. పారిశుద్ధ్య పరిరక్షణలో ప్రజలు సైతం భాగస్వామ్యం అందించి, స్వచ్ఛభారత్ కార్యక్రమాలను జయప్రదం చేయాల్సిందిగా కోరుతున్నామన్నారు. గ్రామసభలో ఎంపీటీసీ సభ్యులు దేవరాజు, మాజీ సర్పంచీలు కోటేష్, గ్రామ పెద్దలు లక్ష్మన్, దేవేందర్, బాలయ్య, తిరుపతయ్య, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆరేపల్లి గ్రామసభకు హాజరైన ప్రజలు